
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

ఆదివారం 15 సెప్టెంబరు 2024 | 5



గుళికల పొడి కాఫీ తీసిన ప్రాణాలు!





ఆ వృద్ధులకు నలుగురు పిల్లలు.. జీవిత చరమాంకంలో వెంట ఒకరూ లేరు.. ఎవరి జీవితాలు వారివి.. ఒక పక్క వయో భారం.. సరిగా చూడలేరు.. సరిగా నడవలేరు.. దంపతులు ఇద్దరికీ శుక్రవారం కాఫీ తాగాలని అనిపించింది.. 64 ఏళ్ల భార్య కాఫీ పొడి అనుకుని గుళికల పొడి వేసి కాఫీ కాసింది.. 70 ఏళ్ల భర్త పక్కనే కూర్చుని కాఫీ అనుకుని ఇచ్చేసింది.. అతనితోపాటు ఆమె కూడా మరో గ్లాస్‌లో తెచ్చుకుంది.. ఇద్దరూ తాగేశారు.. కాసేపటికి నురగలు కక్కుతుండడంతో ఆసుపత్రికి తరలించగా ఇద్దరూ మృతిచెందారు.. వయోభారంతో ఉన్న వృద్ధులను ఒంటరిగా ఉంటే, ఏం జరుగుతుందనే దానికి ఈ సంఘటనే ఓ ఉదాహరణ.. - వివరాలు 7లో

రోగుల పట్ల నిర్లక్ష్యం సహించను : మంత్రి



ఆసుపత్రికి వచ్చిన పేషెంటును నవ్వుతూ పలకరించాలి.. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఒక్క ప్రాణం కూడా పోకూడదు. రాజమహేంద్ర వరం బోధనాసుపత్రిలో ఇటీవల మూడు శిశు మరణాలు సంభవించడం బాధ కలిగించిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు.. శనివారం ఆయన రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను పరిశీలించారు.. వైద్యులతో మాట్లాడారు.. సిబ్బంది సమస్యలు విన్నారు.. అన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. - వివరాలు 7లో

చిక్కని చిరుత జాడ

చిరుత పులి చిక్కలేదు.. ఇప్పటికి 8 రోజులైనా ఇంకా జాడలేదు.. ప్రతి రోజూ కెమెరాకు ఫోజు ఇస్తున్న పులి.. శుక్రవారం మాత్రం ముఖం చాటేసింది.. ఒక్కట్రాప్ కెమెరాకు కూడా చిక్కలేదు. అయితే అటవీ అధికారులు మాత్రం జనం అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.. రాత్రి వేళలో మాత్రమే పులి సంచరిస్తున్నట్టు ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి తెలిపారు. అయితే నేటికీ రిజర్వు ఫారెస్టు వద్ద రక్షణ చర్యలు చేపట్టపోవడం గమనార్హం. దీంతో రాజమహేంద్రవరం సమీపంలోని గ్రామాల జనం భయందోళనలో ఉన్నారు. - వివరాలు 7లో




ఎక్కడో త్రయంబకేశ్వరంలో పుట్టిన గోదావరి.. వేల కిలోమీటర్లు ప్రవహించి రాజమహేంద్రవరం దగ్గర అఖండ గోదావరిగా రూపాంతరం చెందుతుంది. కొండకోనల్లోంచి, దట్టమైన అడవుల్లోంచి పారుతూ వచ్చి ఇక్కడ అపార జలధిగా శోభిల్లుతుంది. సాగు, తాగునీటిని అందిస్తూ ప్రాణాధారమవుతుంది. ఆ గోదావరిని నమ్ముకున్న ఎందరికో జీవనాధారమూ అవుతుంది. కానీ.. వరదొస్తే.. గోదారమ్మ ఉగ్రరూపిణిగా మారిపోతుంది. అప్పటిదాకా శాంతంగా, మంద్రంగా సాగుతున్న గోదావరి ఉరకలేస్తుంది. పరవళ్లు తొక్కుతూ విలయంలా వచ్చిపడుతుంది. పట్టలేనంత కోపంతో ఊగిపోతున్న అమ్మోరులా కళ్ల ముందు తాండవం చేస్తుంది. అప్పుడు వణికిపోవడం మనవంతవుతుంది. అప్పుడు చల్లగ చూడమ్మా గోదారమ్మా అని వేడుకోవడమే మన చేతుల్లో ఉంటుంది. వచ్చిన వరదను ధవళేశ్వరంలో గేట్లన్నీ ఎత్తి, దిగువకు వదిలేస్తే లంకల్ని ముంచేస్తూ సముద్రుడి చెంతకు వడివడిగా సాగిపోతుంది... అక్కడ...

ఇటు గోదారమ్మ.. అటు సముద్రుడు..

వారిద్దరూ మనకు అన్నాచెల్లెళ్లు కింద లెక్క అందుకే ప్రధానంగా గోదావరి సముద్రంలో కలిసేచోటును అన్నాచెల్లెళ్ల గట్టు అంటాం. నిజమే, ఇంత భారీ వరద ముంచెత్తితే మనం వరద బాధితులవుతాం. మరి ఇన్ని లక్షల క్యూసెక్కుల నీటిని.. వేల టీఎంసీ వరదను తనలోకి తీసుకుంటున్న సముద్రంలో ఏం జరుగుతోంది.. గత కొన్నేళ్లుగా ముంచెత్తుతున్న ఇంత భారీ వరద ప్రవాహాన్ని ఎలా స్థిరీకరిస్తున్నారు, అసలు వరద నీటి లెక్కలేంటి.. ఆ కథేంటో చూద్దామా..!

ఆదివారం ప్రత్యేకం

కడలి గుండెల్లో.. గోదారి



సాగరాన..గోదారి

వశిష్ట నది అంతర్వేదిలో సముద్ర సంగమం చేసే ప్రాంతం ఇది. దీన్నే వద్ద అన్నాచెల్లెల గట్టుగా పిలుస్తారు.



మహారాష్ట్ర నాసిక్‌లో పుట్టిన గోదావరి ధవళేశ్వరం వరకు అఖండ గోదావరిగా కొనసాగుతుంది. అక్కడి నుంచి నదీపాయలుగా విడిపోయి వివిధ ప్రాంతాల మీదుగా ప్రవహిస్తూ సముద్రంలో సంగమిస్తుంది. గోదావరి ఉపనదులను 'సప్తరుషు'ల పేర్లతో పిలుస్తారు. సప్తనదీ పాయల సంగమ ప్రాంతం కోనసీమలోనే ఉంది. ధవళేశ్వరంలోని బ్యారేజీ వద్ద గోదావరి రెండు పాయలుగా చీలుతుంది. తూర్పున గౌతమి, పడమర వశిష్ఠ. అక్కడి నుంచి తుల్యభాగ, ఆత్రేయ, గౌతమీ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ఠ అనే పేర్లతో ఏడుపాయలుగా వివిధ ప్రాంతాల్లో సముద్రంలో కలుస్తాయి.

- గోదావరి ప్రయాణం 1480 కి.మీ
- అంతర్వేది వద్ద సాగరంలో సంగమం
- ప్రతి ఏడాది వేలాది టీఎంసీలు
- ప్రవాహ వేగానికి భారీ అగాధాలు
- అక్కడే బేసిన్ ఏర్పాటు
- దీనివల్లే చమురు, గ్యాస్ నిక్షేపాలు
- మత్స్యరాశికి ఎంతో మేలు
- పోలవరం పూర్తయితే ఉపయోగం
- వాతావరణ మార్పులతో ముప్పు



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గోదారమ్మకు వరదొచ్చిందటే ఎంత ఉగ్రంగా ఉంటుందో.. కడలిలో కలిసిపోయిన తరువాత అంత శాంతంగా మారిపోతోంది.. దేశంలోనే అతి పెద్ద నదీపరీవాహక (క్యాచ్‌మెంట్) ప్రాంతాల్లో గోదావరి ఒకటి. ఇందులో ప్రాణహిత, మంజీరా, మానేరు, ఇంద్రావతి, శబరి, సీలేరు, కిన్నెరసాని వంటి ముఖ్య ఉపనదులు, పెద్ద వాగులు కలుస్తాయి. గోదావరి స్థూలంగా ఎగువ, మధ్య, దిగువ నదీ ప్రాంతాలుగా పరిగణిస్తే మధ్య, దిగువ ప్రాంతాల్లోని ప్రాణహిత, ఇంద్రావతి, శబరివంటి ఉప నదుల నుంచే 57 శాతం నీరు గోదావరిలో వస్తుంది. ఇక్కడ ప్రవహించే ప్రతీ 1000 లీటర్ల నీటిలో 600 లీటర్లు ఈ ఉప నదులకు సంబంధించిందే. గోదావరిపై ఎక్కువ నిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టులు లేకపోవడం వల్లే తరచూ వరదలు వస్తున్నాయనే అంచనా ఉంది. గోదావరి వరద ప్రభావం నదీ గమనంలో ఒకే స్థాయిలో ఉండదు. గోదావరికి వరద పోటెత్తితే లక్షలాది క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తారు. ఈ నీరంతా కోనసీమ జిల్లా పరిధిలో అనేక పాయల ద్వారా సముద్రంలో కలుస్తోంది. వరద నీరు చప్పగా ఉంటుంది. గోదావరి వరద 1,480 కిలోమీటర్లు ప్రవహించి చివరకు యానాం, అంతర్వేది ప్రాంతాల్లో సముద్రంలో కలిసే ప్రాంతాన్ని గోదావరి ఈస్టరీగా పిలుస్తారు. చప్పగా ఉండే వరద నీరు సముద్రంలో కలిస్తే అక్కడ సముద్ర ఉప్పు నీటి సాంద్రత కొంత తగ్గుతుంది. దీనివల్ల మత్స్యరాశి భారీగా ఎదగడానికి ఆస్కారం ఏర్పడుతుంది. అదే సమయంలో వరదనీరు సముద్రంలో కలిసే ప్రాంతంలో కొంత ప్రమాదం ఉంది. వరదనీరు పొలాల నుంచి పరిశ్రమల కాలువల నుంచి పారుతూ వచ్చి సముద్రంలో కలిసే క్రమంలో వరి, ఇతర పంట సాగుకు రైతులు ఉపయోగించే ఎరువులు, పురుగుమందు, పరిశ్రమల రసాయనాల కాలుష్యం సముద్ర ముఖంలో కలిసి అక్కడున్న ఉప్పునీటిని విషతుల్యం చేస్తుంది. దీనివల్ల మత్స్యరాశికి కొంత నష్టం ఏర్పడుతుంది. వరద నీరు సముద్రంలో కలిసే చోట నష్టం కంటే లాభమే వేల రెట్లు ఉంటుంది. వరద నీరు ఉధృతంగా వచ్చి సముద్రంలో కలిసే చోట ఆప్రవాహ ధాటికి కోత పెరిగి అగాధాలు ఏర్పడతాయి. ఇలా ఏర్పడ్డ అగాధాల్లోకి వరద ద్వారా కొట్టుకు వచ్చే మట్టి, ఇసుక క్రమేపీ పొరలు పొరలుగా ఏర్ప డుతుంది. ఇలా కొన్ని వందల ఏళ్ల నుంచి సముద్రంలో వరద నీరు కలిసే ప్రాంతాల్లో పెద్దపెద్ద మేటలు పెరిగి బేసిన్‌గా ఏర్పడతాయి. ఈ బేసిన్‌లో మేటల వల్ల రసాయనిక చర్య జరిగి సముద్రంలో చమురు, గ్యాస్ నిక్షేపాలు తయారవుతాయి. ఇప్పుడు కేజీ బేసిన్‌లో కంపెనీలు తవ్వే చమురు, గ్యాస్ నిక్షేపాలు ఇలా ఏర్పడినవేనని శాస్త్రవేత్తలు చెబుతారు.

వరద నీరు కలిస్తే మంచిదే..



సముద్రంలో వరద నీరు కలవడం మంచి పరిణామమే. వరద నీరు ఎంత కలిసినా సముద్రానికి ఏమీ కాదు. ఎందుకంటే హిమాలయ పర్వతాన్ని తెచ్చి సముద్రంలో ముంచితే పర్వతమే మునిగిపోతుంది. పైగా మన దగ్గర బంగాళాఖాతంలో సముద్రం లోతు చాలా ఎక్కువ. దీని సరాసరి లోతు నాలుగు కిలోమీటర్లపైనే ఉంటుంది. అదే సముద్రంలో కొన్నిచోట్ల అగాధాలు 13 కిలోమీటర్లపైనే ఉంటాయి. ప్రధానంగా వరద నీరు సముద్రంలో కలిసే ప్రాం తంలో వరద ప్రవాహం బట్టి అడుగున కోత ఏర్పడుతుంది. అలా కోత ప్రదేశాల్లో అగాధాలు ఏర్పడతాయి. ఈ అగాధాల్లోకి వరదలో కొట్టుకొచ్చిన మట్టి, ఇసుక పొరలుగా ఏర్పడి చమురు, గ్యాస్ తయారీకి సహకరిస్తాయి. వరద నీరు సముద్రంలో కలిసే చోట చప్ప నీటివల్ల కొంత ఉప్పు సాంద్రత తగ్గుతుంది. ఇది కొన్ని రకాల మత్స్య ఉత్పత్తులకు చాలా మేలు చేస్తుంది.

- జీఎంఎస్ శర్మ, రిటైర్డ్ చీఫ్ సైంటిస్ట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ

ముమ్ముందు ముప్పు..

ఒకపక్క వరదలు.. మరోపక్క భూమి మీద ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో వాతావరణ మార్పులతో సముద్రమట్టం పెరిగే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ వాతావరణ మార్పుల విభాగం ఇప్పటికే హెచ్చరించింది. 2100 నాటికి ఈ మార్పుల ఫలితంగా సముద్రం, గోదావరి సంగమించే ప్రాంతంలో నీటిమట్టం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దీనివల్ల ఉప్పునీరు మరింత ముందుకు రావడంతోపాటు సమీపంలో తీరంలోని 264 గ్రామాలకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది. సముద్రం, గోదావరి కలిసే ప్రాంతాల్లో రక్షణగా ఉన్న మడ అడవులు దెబ్బతినడంతోపాటు భూగర్భ జలాలు కొంత ఉప్పుమయంగా మారుతాయని హెచ్చరించింది.

సప్తనదుల సంగమం..

గౌతమి.. ధవళేశ్వరం నుంచి తూర్పువైపు ప్రవహిస్తున్న గౌతమి నది రావులపాలెం, కోటిపల్లి మీదుగా సుమారు 60 కిలోమీటర్ల మేర ప్రవహించి పాండిచ్చేరి రాష్ట్రంలోని యానాం సమీపంలో గల తీర్థాల మొండిలో సముద్రంలో కలుస్తుంది. నదుల్లోకెల్లా అతిపెద్ద నదిగా, అత్యంత పవిత్రమైనదిగా గౌతమికి పురాణ చరిత్ర ఉంది.

వృద్ధగౌతమి.. వృద్ధగౌతమి నదీపాయ ముక్తేశ్వరం నుంచి విడిపోయి గేదెల్లంక వద్ద త్రివేణి సంగమం నుంచి మురమళ్ల, పల్లంకుర్రు మీదుగా సుమారు 22 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. పల్లంకుర్రు, బలుసుతిప్ప, మగసానితిప్ప మీదుగా ప్రవహించిన వృద్ధగౌతమీ నది తీర్థాల మొండి వద్దే సముద్ర సంగమిస్తుంది. ఈ నదీ పాయను ఆనుకుని మత్స్యకార గ్రామాలు ఉన్నాయి.

వశిష్ఠ నది.. విజ్జేశ్వరం నుంచి పడమరన వశిష్ఠ నది ప్రవహిస్తుంది. సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించిన వశిష్ఠనది విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం, పి.గన్నవరం, రాజోలు, సఖినేటిపల్లి, అంతర్వేది మీదుగా ప్రయాణించి అంతర్వేదిలో సముద్ర సంగమిస్తుంది. ఈ ప్రాంతాన్ని అన్నాచెల్లెలు గట్టుగా పిలుస్తుంటారు. ఈ సంగమ ప్రాంతం ప్రమాదకరంగా మారడంతో భక్తులను స్నానాలకు అనుమతించడం లేదు. ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి కలిగిన అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ క్షేత్రం ఉంది.

వైనతేయ నది.. వశిష్ఠ నది నుంచి మరో పాయగా పి.గన్నవరానికి సమీపంలో చీలి వైనతేయ నదిగా ప్రవహిస్తుంది. పి.గన్నవరం, తొండవరం, బోడసకుర్రు, గోపాయిలంక మీదుగా 28 కిలోమీటర్ల మేర ప్రవహించి బెండమూర్లంక వద్ద సముద్ర సంగమం చేస్తుంది. ఇక్కడ అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం ఉంది.

కౌశిక నది.. వైనతేయ నుంచి విడిపోయి అప్పర్ కౌశిక, లోయర్ కౌశికలుగా విడిపోయి వివిధ గ్రామాల గుండా ప్రవహించి అల్లవరం మండలం బెండమూర్లంక, కొమరగిరిపట్నం మీదుగా ప్రవహిస్తూ రామేశ్వరం వద్ద సముద్ర సంగమిస్తుంది. ఇది మేజర్ డ్రెయిన్‌గా కూడా ఈ ప్రాంత ప్రజలు భావిస్తుంటారు. తుల్యభాగ నది కోరంగి వద్ద సముద్రంలో కలుస్తుంది.

- అమలాపురం/ఆంధ్రజ్యోతి

సముద్రంలో కలిసే నదులెన్నో..

కాకినాడ జిల్లాలోనే తుని మండలం పరిధిలో తాండవ ప్రాజెక్టు నీరు అంతా తునికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్రంలో కలుస్తోంది. తొండంగి మండలంలో పంపా నది వరద నీరు వేమవరం మీదుగా అనకాపల్లి జిల్లా రాజవరం వద్ద, వర్షం నీరు జమ్మేరు కాలువ ద్వారా పెరుమాళ్లపురం మీదుగా ఉప్పాడ కొత్తపల్లి మండలం మూలపేట వద్ద సముద్రంలో కలుస్తోంది. యు.కొత్తపల్లి మండలంలో నాగులాపల్లిలోని పెదయేరు కాలువ ద్వారా, కొమరగిరిలోని అబ్బిరాజు యేరు, కొండెవరంలో కొండయ్య కాలువ, మారెమ్మ కాలువ, కొత్తపల్లి కొవ్వ కాలువ ద్వారా సముద్రంలోకి చేరుతోంది. కరప మండలంలో తుల్యభాగ డ్రెయిన్ ద్వారా తాళ్లరేవు మండలం మట్లపాలెం, పాతర్ల గడ్డ డ్రెయిన్ కరపమండలం ఉప్పలంక వద్ద సముద్రంలో కలుస్తోంది. తాళ్లరేవు మండల పరిధిలో ఆత్రేయ గోదావరి, మందార కాలువ ద్వారా సముద్రంలో వరద కలుస్తోంది.

పోలవరం పూర్తయితే..

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే గోదావరి వరద నీటిని కొంతవరకూ సద్వినియోగం చేసుకోవచ్చు. పోలవరం రిజర్వాయర్ కెపాసిటీ 194 టీఎంసీలు. అందులో 175 టీఎంసీలు వినియోగించుకోవచ్చు. 19 టీఎంసీలు రిజర్వాయర్‌లో ఉంటాయి. పోలవరం ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ ఎత్తు 39.28 మీటర్లు లేదా 129 అడుగులు. ఇది ఎర్త్ డ్యామ్ ఎగువన అతి తక్కువ రివర్ బెడ్ స్థాయి నుంచి ఉంటుంది. డ్యామ్ పొడవు 3,722 మీటర్లు (12,211 అడుగులు). స్పిల్‌వే కెపాసిటీ 36 లక్షల క్యూసెక్కులు.

71 ఏళ్లుగా గోదారి ఇలా...

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి వరద రావడం.. ప్రతి ఏటా వేల టీఎంసీల నీరు వృధా అవుతోంది. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ కెపాసిటీ 3 టీఎంసీలు. అప్పుడు పాండ్ లెవల్ 14.20మీటర్లు ఉంటుంది. బ్యారేజీ నీటిమట్టం 11 అడుగులు ఉంటుంది. దానికంటే తగ్గితే మూడు టీఎంసీల నీరు లేనట్టే. సాధారణంగా వరదల సమయంలోనే ఈ నిల్వ ఉంటుంది. ధవళేశ్వరం సర్కిల్‌లోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ డెల్టాల్లో సుమారు 10 లక్షల ఎకరాల సాగు, మంచినీరు, పారిశ్రామిక, చేపల చెరువుల అవసరాలకు ఒక పంట సీజన్‌కు 110 టీఎంసీల నీరు కావాలి.

1986లో అతిపెద్ద వరద

1953 నుంచి వరద ప్రవాహాన్ని లెక్కిస్తున్నారు. 1953 ఆగస్టు 16న బ్యారేజీ నీటిమట్టం 22.75 అడుగులకు చేరడంతోపాటు 30,03,100 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి పోయింది. అప్పట్లో అనేక గండ్లుపడ్డాయి. ఈ వరదను ప్రాతిపదికగా తీసుకుని ఏటిగట్లు పటిష్టం చేశారు. 1986లో బ్యారేజీ నీటిమట్టం 24.55 అడుగులకు చేరడంతో 35,06,380 క్యూసెక్కుల వరద వచ్చింది. క్యూసెక్కు అంటే సెకనుకు వరద ప్రవాహం. ఒక టీఎంసీ 11,575 క్యూసెక్కులు. 1986లో ఆగస్టు 16న బ్యారేజీ నుంచి సెకనుకు 35,06,380 క్యూసెక్కుల నీరు ప్రవహించినట్టు లెక్క. ఆ ఒక్క రోజునే 302.92 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిపోయింది. అప్పట్లో కూడా గండ్లు పడ్డాయి. అనంతరం అప్పటికి 5 మీటర్ల ఎత్తు ఉన్న ఏటిగట్లను 7 మీటర్లకు పెంచారు. గోదావరికి సుమారు 420 కిలోమీటర్ల ఏటిగట్టు ఉంటే.. రాజోలు, పి.గన్నవరం మండలాల్లో, ఇతర ప్రాంతాల్లోనూ సుమారు 30 కిలోమీటర్ల గట్టు ఎత్తు చేయలేదు. ఇది ఇప్పటికీ సమస్యగానే ఉంది. తర్వాత అంత పెద్ద వరద రాలేదు. 2022 జూలై 17న నీటిమట్టం 21.70 అడుగులకు చేరడంతోపాటు బ్యారేజీ నుంచి 25,80,963 క్యూసెక్కులు వరద సముద్రంలోకి పోయింది.

1953 నుంచి వరదలు ఇలా..

1953 నుంచి 2024 సెప్టెంబరు వరకూ మొత్తం 21సార్లు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. 26సార్లు రెండో ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. ఐదు సార్లు మొదటి ప్రమాద హెచ్చరిక వరకే వరదొచ్చింది.18 సార్లు ఏవిధమైన హెచ్చరికలు లేకుండానే వరదొచ్చి వెళ్లిపోయింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 11.75 అడుగులకు నీటిమట్టం చేరినా, 10 లక్షల క్యూసెక్కులు మిగులు జలాలు ఉన్నా మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 13.75 అడుగులు నీటిమట్టం ఉన్నా, 13 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు ఉన్నా, రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 17.75 అడుగులకు నీటిమట్టం చేరినా 15 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు ఉన్నా మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. మూడో ప్రమాద హెచ్చరిక అనేది చాలా డేంజర్ లెవల్ హెచ్చరిక.

మూడేళ్లలో 11,560.261 టీఎంసీలు

ప్రతి ఏటా జూన్ నుంచి మే నెల వరకూ వాటర్ ఇయర్ అంటారు. కానీ సాధారణంగా జూన్ నుంచి డిసెంబర్ వరకే గోదావరికి నీరు ఉంటుంది. ప్రతి ఏటా వేల సంఖ్యలో ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటికి 3307.306 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి. 2021 లో 2493.475 టీఎంసీలు, 2022లో 6246.214 టీఎంసీలు 2023లో 2821.572 టీఎంసీలు కలిపి ఆ మూడేళ్లలో 11,560.261 టీఎంసీల గోదావరి నీరు సముద్రం పాలైంది. ఇరిగేషన్ అధికారుల వద్ద ఒక లెక్క ఉంది. ప్రతి నాలుగేళ్లకు 20 లక్షల క్యూసెక్కులకు మించిన వరదొస్తుందని, ప్రతి పదేళ్లకు 25 లక్షలకు మించిన వరదొస్తుందనేది లెక్క. కానీ వాతావరణ కలుషిత, ఆక్రమణలు వల్ల ఈ లెక్క తప్పినట్టు కనిపిస్తోంది.



అవార్డు ప్రతిని అందజేస్తున్న పీడీజే సునీత

జాతీయ లోక్ అదాలత్..
3 వేల కేసులు పరిష్కారం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని న్యాయ స్థానాల్లో ఏర్పాటు చేసిన 44 ప్రత్యేక న్యాయపీఠాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,053 కేసులు పరిష్కరించడం జరిగిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. రాత్రి 9గంటల వరకూ కేసులను విచారించి రాజీ మార్గం ద్వారా పరిష్కరించి రూ.35.57 కోట్లకు సంబంధించిన అవార్డు (తీర్పు)లను ప్రకటించామన్నారు. వీటిలో 576 సివిల్, 2273 క్రిమినల్, 204 ప్రీ-లిటిగేషన్ కేసులు ఉన్నాయని తెలిపారు. లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇసుకెలా!?



ఇసుక తీతకు గోదావరి వరద దెబ్బ

- వచ్చేవారం వరకూ ఇబ్బందే
- జిల్లాలో తీవ్ర కొరత
- బోట్స్‌మన్ సొసైటీల ముసుగు
- ఇసుక తీతకు తీవ్ర పోటీ...
- రాజకీయ సిఫార్సులూ అధికమే
- నిబంధనలతో వడబోస్తున్న కలెక్టర్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండగోదావరిలో డీ సిల్టేషన్ పేరుతో ఇసుక తీతకు ప్రభుత్వం అనుమతిచ్చినా, వరద వల్ల ఇసుక తీత ఆరంభంకాలేదు.ఈ నెల 11వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక ఆర్డర్లు బుక్ చేసుకోవడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ అదే రోజు నుంచి గోదావరి వరద పెరగడంతో ర్యాంపులు ప్రారంభం కాలేదు. వచ్చే వారం వరకూ ఇసుక కొరత తప్పదు. ఇప్పటికే జిల్లాలో ఇసుక కొరత అధికంగా ఉన్న సంగతి తెలిసిందే.గత బుధవారం నుంచి బోట్స్‌మన్ సొసైటీల ద్వారా డీసిల్టేషన్ చేయించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.ఎన్ని బోట్స్‌మన్ సొసైటీలను ఎంపిక చేశారనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. మొత్తం 9 డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. బోట్స్‌మన్ సొసైటీల పేరుతో ఇసుక తీసే వారిలో పోటీ పెరిగింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక విధానం ఎత్తివేసి ఇష్టానుసారం ఇసుక తోడేసిన సంగతి తెలిసిందే. అఖండగోదావరిలో బోట్స్‌మన్ సొసైటీలను అడ్డుపెట్టుకుని డ్రెడ్జింగ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం మారడంతో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ ఇంత వరకూ గత ప్రభుత్వం స్టాక్ పెట్టిన ఇసుకనే ఉచిత విధానంలో అమలు చేశారు. జిల్లాలో అధికారులు ఇసుక అక్రమాలు లేకుండా సక్రమంగా ఉచిత ఇసుక అమలు చేయడానికి మార్గదర్శకాలు రూపొందించింది.ఈ నెల 11 నుంచి మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు.గోదావరి వరద వల్ల జిల్లాలో ఓపెన్ ర్యాంపులను తెరిచే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ముందుగా అఖండ గోదావరిలో ధవళేశ్వరం బ్యారేజీ లోపల నుంచి ఫోర్త్ బ్రిడ్జి వరకూ డీసిల్టేషన్ విధానంలో ఇసుక తీతకు నిర్ణయించారు.ఈ పరిధిలో కొత్తగా డీసిల్టేషన్‌కు 9 పాయింట్లు గుర్తించామన్నారు.ధవళేశ్వరంలో 2, కోటిలింగాల ప్రాంతంలో ఒకటి, కొవ్వూరు పరిధిలోని వాడపల్లి, ఔరంగాబాద్-1, ఔరంగాబాద్-2, ఎర్రినమ్మ, దొండగుంట పాయింట్లు ఉన్నాయి.ఆయా ర్యాంపుల్లో ఇసుక తీత మొదలయ్యే అవకాశం ఉంది.ఈ డీసిల్టేషన్‌ను బోట్స్‌మన్ సొసైటీ ద్వారా తీయించడానికి నిర్ణయించారు.దీనితో గతంలో ఇసుక వ్యాపారం రుచి ఎరిగిన వారు ఈసారి ప్రయత్నాలు ఆరంభించారు. కానీ అధికారంలోకి వచ్చిన కూటమికి చెందిన వారు ఎక్కువ ఇసుక తీతకు ముందుకు వస్తున్నారు.దీంతో ప్రజాప్రతినిధులపై తీవ్ర ఒత్తిడి పెరిగింది.ఎమ్మెల్యేలు తట్టుకోలేనంతగా ఒత్తిడి పెరిగింది. పాతవారు, కొత్తవారు రిజిస్ట్రేషన్ చేయించుకుని బోట్స్‌మన్ సొసైటీలు నిర్వహించడానికి ముందుకొస్తున్నారు. కానీ గతంలో మాదిరిగా అధికారులు ఒప్పుకోవడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ లక్ష్యం నెరవేరడమే పనిగా వ్యవహారం సాగింది. ఈ విధానం మార్చాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రయత్నిస్తున్నారు. ప్రతి బోట్‌కు లైసెన్స్, ఫిట్‌నెస్, సొసైటీలకు రిజిస్ట్రేషన్, ఆడిట్ తప్పనిసరి చేశారు.దీంతో అనే సొసైటీలు గాబరా పడుతున్నారు. ఇరిగేషన్ అధికార్లకు ప్రస్తుతం 175 సొసైటీలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిని 13మంది సభ్యులతో కూడిన ఎంప్యానల్ కమిటీ పరిశీలించి అనుమతులు ఇస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న సొసైటీల్లో సుమారు 30 నుంచి 35 వరకూ మాత్రమే అర్హత కలిగిఉన్నట్టు తెలిసిందే. బోట్స్‌మన్ సొసైటీ నిర్వాహకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.కానీ వారి ఒత్తిడికి లొంగేటట్టు అధికారులు కనిపించడంలేదు.ఈ నేపథ్యంలో చాలా సొసైటీలు ఎగిరిపోతాయి.రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో సుమారు 220 సొసైటీలు ఉన్నాయి. వాటిలో ఇప్పటికే 175 దరఖాస్తు చేసుకుంటే అందులో సుమారు 30నుంచి 35వరకూ అనుమతి లభించినట్టు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వరద తగ్గినా వచ్చే వారంలో ఏమేరకు డీ సిల్టేషన్ ఇసుక తవ్వకాలు మొదలవుతాయో చూడాలి మరి. ఇదిలా ఉండగా ఈసారి ఇసుక సరఫరాపై గట్టి నిఘా పెడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి వీలుగా వినియోగదారుడి వివరాల ఆధారంగా క్రాస్ చెక్ చేసే వ్యవస్థను అమలులోకి తెచ్చారు.సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు.

కాఫీ పొడి అనుకుని.. గుళికల పొడితో..

కాఫీ చేసుకుని తాగిన వృద్ధ దంపతులు
చికిత్స పొందుతూ అరగంట వ్యవధిలో ఇద్దరి మృతి
పల్ల కడియంలో విషాదఛాయలు


గోవిందు, అప్పయ్యమ్మ(ఫైల్ ఫొటో)..మృతదేహాలు

రాజానగరం, సెప్టెంబరు 14 : తూర్పుగోదావరిజిల్లా రాజానగరం మండలం పల్లకడియం గ్రామంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెలుచూరి గోవిందు(70) భార్య అప్పయ్యమ్మ(64)అనే వృద్ధ దంపతులు గ్రామంలో రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నలుగురు సంతానం కాగా, వీరిలో కొడుకు రాజమహేంద్రవరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ దుస్తులు ఇస్త్రీ చేసుకుంటూ, కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామంలో ఒంటరిగా జీవనం సాగిస్తున్న వీరికి వయోభారంతో కంటిచూపు మందగించింది. ఇదే గ్రామంలో వేరొకచోట ఉంటున్న కూతురు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను సపర్యలు చేస్తుంటుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఒక కోతి గుళికల పొడి ప్యాకెట్టు తీసుకొచ్చి ఇంటిపై పడేసింది. అది కాస్తా కిందికి జారి వాకిట్లో పడింది. కాఫీ పొడిగా భావించి ఇంట్లో పెట్టారు. దీనిని అప్పయ్యమ్మ కాఫీ పొడి అనుకుని శుక్రవారం పాలలో వేసుకుని కాఫీ కాసుకుని ఇద్దరు తాగారు. అనంతరం కొద్దిసేపటికి మగతగా ఉండటంతో మంచంపై వాలిపోయారు. మంచంపై పడిఉన్న వీరిని సమీపంలోని ఓ వ్యక్తి చూసి పిలిస్తే పలకకపోవడంతో అనుమానంతో గ్రామంలో నివసిస్తున్న కూతురికి సమాచారం అందించాడు. కుమార్తె హుటాహుటిన ఇంటికి వచ్చి తల్లిదండ్రులను చూసి ఏమైందని అడగ్గా రెండు రోజుల క్రితం కోతి ఒక కవర్ తెచ్చి ఇంటిపై వేసిన కాఫీ ప్యాకెట్ నుంచి రెండు స్పూన్ల పొడి తీసుకుని కాఫీ కాసుకుని తాగామని చెప్పారు. దీంతో అనుమానంతో ఇంట్లో కెళ్లి ప్యాకెట్ పరిశీలించగా అది ఏవిధమైన వాసనలేని గుళికలు మందు ప్యాకెట్‌గా గుర్తించి, ప్రాణాపాయస్థితిలో ఉన్న తల్లిదండ్రులను ఆటోలో ఎక్కించి చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమించడంతో శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈమేరకు కూతురు కోటిపల్లి వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రాజానగరం ఎస్‌ఐ వెంకట రేవతి శనివారం తెలిపారు. శవపంచనామా అనంతరం పోలీసులు పోస్టుమార్టం జరిపించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. వృద్ధ దంపతులు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మరోవైపు వీరి మృతిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


అమలాపురంలో రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు


రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా చాటుతున్న యువతులు

తగ్గేదేలే..

- రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం
- మహిళా విభాగంలో తొలిరోజు పోటీలు
- సత్తా చాటిన యువతులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 14: తగ్గేదేలే.. అన్నట్టుగా రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో యువతులు సత్తాచాటారు. తొలిరోజు మహిళా విభాగంలో నాలుగు కేటగిరీల్లో నిర్వహించిన పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి మహిళా పవర్ లిఫ్టర్లు హాజరయ్యారు. అమలాపురం దుడ్డువారి అగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్ కోనసీమ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. శనివారం ఈ పోటీలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ప్రారంభించారు. మెట్రోకెమ్ అధినేత నందెపు వెంకటేశ్వరరావు(బాలాజీ) సౌజన్యంతో రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు తొలిరోజు అన్ని జిల్లాల నుంచి 372 మంది క్రీడాకారులు హాజరయ్యారు. చీఫ్ ఆర్గనైజర్ ఎస్.కోటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎస్.సూర్యనారాయణ, పి.సతీష్, టి.త్రినాథ్ (విశాఖ), ఎస్కే.సందాని, భాస్కరరావు (గుంటూరు), జి.భక్తధ్రుతి (ఒంగోలు), హెచ్ .గణేష్, వి.మల్లేశ్వరరావు, డి.అనూషఅన్వర్ (ఎన్టీఆర్‌జిల్లా), ఎం.వెంకటేశ్వరరావు (కృష్ణా), ఏవై ప్రసాద్(బాపట్ల), డీవీవీ సత్యనారాయణ (తూర్పుగోదావరి) వ్యవహరించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుముల కృష్ణపద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు అల్లాడ శరత్‌బాబు, ఏడిద శ్రీను, కల్వకొలను తాతాజీ, బొర్రా ఈశ్వరరావు, రంకిరెడ్డి కాశీ, పప్పుల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

తొలిరోజు మహిళా విజేతలు వీరే..

విభాగంలో తొలిరోజు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. విజేతల వివరాలను వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన ఎస్కే. సాదియాఅల్మాస్ పలు విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచింది. అదేవిధంగా వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన హర్షిత తివారి, కోనసీమ జిల్లాకు చెందిన ఎం.దుర్గ పలు విభాగాల్లో ప్రథమస్థానం సాధించారు.

నేటి నుంచి వలీబాబా ఉరుసు ఉత్సవాలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కొత్తలంకలోని వలీబాబా ఉరుసు మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. వలీబాబా 77వ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని వలీబాబా దర్గా కమిటీ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు శనివారం పూర్తి చేసింది.బాబా ఉరుసు ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి హిందూ, ముస్లిం భక్తులు తరలివచ్చి వారివారి మతాచారాల ప్రకారం బాబాకు పూజలు జరిపిస్తుంటారు. ఆదివారం గంధం పూయుట, సోమవారం దీపారాధన, మంగళవారం జియారత్ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని బాబా దర్గాను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించి పందిళ్లు వేశారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తుల కోసం వసతి, మంచినీరు వంటి ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం మరుగుదొడ్లు, స్నానపు గదులు వంటి సౌకర్యాలు కల్పించారు.

గ్యాస్ లీక్ కాదు.. నీటి బుడగలు

మామిడికుదురు, సెప్టెంబరు 14: జాతీయ రహదారి విస్తరణలో నగరంలోని బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఓ వంతెన వద్ద చేరిన వర్షం నీటిలో శనివారం బుడగలు రావడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓఎన్జీసీ, గెయిల్ అధికారులు సంఘటన స్థలానికి వచ్చి బుడగలు వస్తున్న ప్రదేశంలో పరీక్షలు నిర్వహించి అది గ్యాస్ లీకేజీ కాదని తేల్చి చెప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వంతెన నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన పిల్లరు వద్ద అప్పుడప్పుడు నీటి బుడగలు వచ్చే ఆస్కారం ఉందని గెయిల్ బ్లాక్ ఇన్‌చార్జి కె.రాంబాబు తెలిపారు. బుడగులు వస్తున్న ప్రాంతానికి కొన్ని అడుగుల దూరంలో గెయిల్ పైపులైను ఉండడంతో స్థానికులు పైపులైను లీకేజీ అని భ్రమపడ్డారని గెయిల్ బ్లాక్ ఇన్‌చార్జితో పాటు ఓఎన్జీసీ షిఫ్ట్ ఇన్‌చార్జి సురేన్ గుప్తా తెలిపారు.

ఉపాధ్యాయుడిపై వేటు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 14: విద్యార్థినిని వేధిస్తున్న ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ ఎంపీపీఎస్‌ఎంపీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.సన్యాసిరావు ఆ స్కూల్ విద్యార్థినిని వేధిస్తున్నట్టుగా వచ్చిన ఫిర్యాదు పై విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. నివేదిక ఆధారంగా అతడిని సస్పెండ్ చేసినట్లు జిలా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

సీతానగరం,సెప్టెంబరు 14: రోడ్డు ప్రమాదంలో కాటవరం ఎంయూపీ స్కూల్‌లో 8వ తరగతి విద్యార్థిని ఉర్ల లక్ష్మీ రూప కుమారి (12) మృతి చెందినట్లు ఎస్‌ఐ డి రామ్‌కుమార్ తెలిపారు ఆయన కథనం ప్రకారం.. కాటవరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న రూప కుమారి పాఠశాల అనంతరం ఇంటికి వెళ్లేందుకు ట్రక్ ఆటో ఎక్కింది. కాటవరం రైస్‌మిల్లు వద్ద మలుపులో లక్ష్మి కుమారి అదుపు తప్పి కింద పడిపోయింది. ఆమె తలకు పెద్ద దెబ్బ తగలడంతో చికిత్స నిమిత్తం అదే ట్రక్కు ఆటోలో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. శనివారం మృతురాలి తండ్రి ఉర్ల వెంకటరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోరాహోరీగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

అన్నవరం, సెప్టెంబరు 14: అన్నవరంలో అంతర్‌జిల్లాల బాలబాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు రెండో రోజైన శనివారం హోరాహోరీగా జరిగాయి. బాలురుకు సంబంధించి 20 మ్యాచ్‌లు జరగగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు కర్నూలు, విశాఖ జట్లపై ఓటమి చెందగా... కృష్ణా, పశ్చిమగోదావరి జట్లపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు విజయం సాధించింది. కడప, కర్నూలు, శ్రీకాకుళం జట్లు అత్యంత ప్రతిభ కనబరుస్తున్నాయి. తూర్పుగోదావరి మహిళా జట్టు మూడు మ్యాచ్‌లలో విజయం సాధించగా చిత్తూరు జిల్లాపై ఓటమి చెందింది. ఆదివారంతో మ్యాచ్‌లు ముగుస్తాయని, ప్రతిభ కనబరిచిన వారిలో ఒక టీంను ఎంపిక చేసి వారిని రాష్ట్ర టీంగా హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపుతామని జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ముప్పన వీర్రాజు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలి

అన్నవరం, సెప్టంబరు 14: రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా.. సిబ్బంది అంతా రత్నగిరి, సత్యగిరితో పాటుగా దేవస్థానం దిగువన పరిసరాల పరిశుభ్రతపై దృష్టిసారించాలని ఈవో రామచంద్రమోహన్ ఆదేశి ంచారు. శనివారం ఆయన కార్యాలయంలో అన్ని విభాగాల ఏఈవోలు, సూపరింటెండెంట్, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఈనెల 17 నుంచి ప్రణాళికలతో వ్యవహరించి అక్టోబరు ఒకటో తేదీ నాటికి ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ప్రతి ఉద్యోగి ఉదయ ం పది గంటల నుంచి ఒంటి గంట వరకు అణువణువూ శోధించి ఎక్కడ చెత్త పేరుకుపోయినా, వ్యర్థాలను కార్యాలయాల్లో ఉంచినా వాటిని తొలగించేవిధంగా యాక్షన్‌ప్లాన్ చేయాలన్నారు. అక్టోబరు 2న మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామన్నారు. సమావుశంలో పీఆర్వో కృష్ణారావు, ఏఈవోలు ఎల్ శ్రీనివాస్, కొండలరావు, జగ్గారావు, ఈఈ నరసింహారెడ్డి, డీఈలు రాంబాబు, ఉదయ్‌కుమార్, సూపరింటెండెంట్లు బలువు సత్యశ్రీనివాస్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళల్లో చిరుత సంచారం

త్వరలోనే పట్టుకుంటాం : డీఎఫ్‌వో భరణి



దివాన్‌చెరువు, సెప్టెంబరు 14 : చిరుతపులిని త్వరలోనే ఖచ్చితంగా పట్టుకుంటామని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి తెలిపారు. శనివారం స్థానిక మీడియాతో ఆమె మాట్లాడారు. ఇంతవరకూ నివాస ప్రాంతాలలో చిరుతపులి సంచరించినట్లు నిర్ధారణ లేదన్నారు. చిరుతను సురక్షితంగా పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని అందులో భాగంగా 50 మంది సభ్యులు తొమ్మిది బృందాలుగా ఏర్పడి చిరుతపులి జాడ కోసం గాలిస్తున్నారన్నారు. చిరుత కదలికలను గుర్తించేందుకు 50 ట్రాప్ కెమెరాలు, సీసీ కెమెరాలతో బాటు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే నాలుగు ట్రాప్ బోనులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న నివాసప్రాంతాల వారు వారి ఇంటి పరిసరాలలో చెత్త వేయవద్దని కోరారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. రాత్రివేళల్లోనే చిరుతపులి సంచరిస్తోందని పగలు దాని కదలికలు ఉండడంలేదన్నారు. జాతీయ రహదారికి దివాన్‌చెరువు-లాలాచెరువు మధ్య రెండుప్రక్కలా అడవి ఉందని అందుచే పోలీస్‌లతో బాటు, తమ సిబ్బంది కంట్రోలింగ్ చేస్తున్నారని తెలిపారు. ముందు జాగ్రత్తగా కొన్నిచర్యలు చేపట్టామని తెలిపారు. ట్రాప్ బోనువద్దకు చిరుతపులి రాకపోవడానికి గల కారణాలపై ప్రశ్నించగా దానికి అవసరమైన ఆహారం సమృద్ధిగా బయటే లభిస్తోందని అన్నారు. చిరుతపులి ట్రాప్‌బోను ప్రక్కకు వస్తోందని అన్నారు. అందులో ఏమి ఉందన్న విషయం కుడా ప్రయత్నిస్తోందని చెప్పారు. సహజ అటవీ ప్రాంతంలో ట్రాప్‌బోను కృత్రిమ వస్తువు అన్నారు. దాని పై నమ్మకం కుదిరితే అదిట్రాప్‌బోనులో ప్రవేశిస్తుందని అన్నారు. అపుడు చిరుతపులిని పట్టుకోవచ్చుని చెప్పారు. దీని ప్రకారమే చేస్తున్నామన్నారు. ఎక్కడైనా చిరుత కదలికలపై అనుమానాలు ఉంటే తెలిపితే తమసిబ్బంది అక్కడకు వచ్చి పరిశీలిస్తారని అన్నారు. అయితే అసత్యప్రచారాలు, నకిలీవార్తలు వ్యాప్తి చేయవద్దని కోరారు. చిరుతపులి కదలికలను తెలుసుకునేందుకు వనరులయాజమాన్యం ఎంతో ముఖ్యమని చెప్పార అత్యవసర పరిస్థితులలో వినియోగించెకునేందుకు వీలుగాథర్మల్‌డ్రోన్ అందుబాటులో ఉంచుకుని సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని ఒకప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక ప్రణాళిక

- బోధనాసుపత్రిలో శిశు మరణాలు బాధ కలిగించాయి
- విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, చిత్రంలో పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు, కలెక్టర్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 14: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవల కోసం 30 పాయింట్ల ఫార్ములాతో ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక రూపొందించామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాజమహేంద్రవరం బోధనాసుపత్రిలో ఇటీవల మూడు శిశు మరణాలు సంభవించడం బాధ కలిగించిందని మంత్రి పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరం బోధనాసుపత్రిని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కామినేని శ్రీనివాస్‌లతో కలసి ఆయన సందర్శించారు. ఎంసీహెచ్ బ్లాకులోని గైనిక్ విభాగంలో తనిఖీలు చేశారు. పిల్లల వార్డును పరిశీలించారు. ఎంసీహెచ్ బ్లాకులోని సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రశాంతి, వైద్యాధికారులు, హెచ్‌వోడీలు, వైద్యులు, ప్రధాన వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష జరిపారు. ఆసుపత్రిలోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ఒక్క ప్రాణం కూడా పోకూడదన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ మెరుగైన చికిత్సా విధానాలు, మౌలిక సదుపాయాల కల్పన, పరిస్థితుల్లో మార్పులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వైద్య వృత్తిని ఎంచుకున్న వారంతా అంకితభావంతో సేవలందించాలని, ఏదైనా తెలిసి తప్పు జరిగితే ఉపేక్షించరాదన్నారు. వేళ్లూనుకుపోయిన అవినీతిని నియంత్రించాలని, వ్యవస్థలో మార్పు తీసుకురావాలని సూచించారు. తాను సమస్యలు తెలుసుకోవడానికే ఇక్కడకు వచ్చానని, అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. ప్రతి మెడికల్ కాలేజీలోనూ 35నుంచి 40శాతం ఫ్యాకల్టీ కొరత ఉంటే ఇక పిల్లలకు పాఠాలు ఎలా చెబుతారన్నారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంటును నవ్వుతూ పలకరించాలని, వైద్యులు సిబ్బంది సమయానికి రావాలన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ బయటి వ్యక్తుల ద్వారా రోగులు దోపిడీకి గురవుతున్నారని, ఈ సమస్య పరిష్కరించాల్సి ఉందన్నారు. బోధనాసుపత్రి నిర్వహణా వ్యవస్థలపై, ఇక్కడ అందుతున్న వైద్యసేవలు, రోగులకు ఎదురవుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చామన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రి మార్చురీలో ప్రైవేట్ వ్యక్తులు ఫ్రీజర్లు ఏర్పాటు చేసుకుని అధికమొత్తంలో డబ్బులు గుంజుతున్నారని, వాటిని నియంత్రించాలన్నారు. ఏపీఎంఎస్‌ఐడీసీ డీఈ కృష్ణారావు మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్, ఇతర వైద్యాధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు. ముందుగా రోటరీ క్లబ్ రాజమండ్రి-రోటరీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జీజీహెచ్‌కు అందజేసిన వీల్‌చైర్లు, స్ట్రెచర్లను మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు.

జలాశయాల్లో కొనసాగుతున్న నీటి విడుదల


డొంకరాయి జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

మోతుగూడెం, సెప్టెంబరు14: సీలేరుకాంప్లెక్స్ పరిధిలోని బలిమెల, గుంటవాడా, డొంకరాయి జలాశయాల నుంచి శనివారం కూడా దిగువకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. సీలేరు నదీ పరివాహిక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టినా ఆంధ్ర, ఒడిశా ఉమ్మడి జలాశయమైన బలిమెలకు జోలాపుట్ , డుడుమనది పరివాహక ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. బలిమెల పూర్తిస్థాయి నీటి మట్టం 1516 అడుగులు కాగా ఆ స్థాయికి నీరు చేరితే జలాశయంపరివాహక ప్రాంతాల గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. దీంతో ఒడిశా అధికారులు నీటి మట్టం పెరగకుండా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. శనివారం కూడా బలిమెల జలాశయం నుంచి దిగున ఉన్న గుంటవాడ (సీలేరు)కు 14,776 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బలిమెల నుంచి గుంటవాడకు నీరు వచ్చి చేరడంతో గుంటవాడ 1357.60 అడుగుల నీటిమట్టం కొనసాగుతోంది. గుంటవాడ నుంచి దిగువకు ఒక్క గేటు ద్వారా 10,800 క్యూసెక్కులు మాత్రమే జెన్కో అధికారులు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం మరో 8100 క్యూసెక్కుల విడుదల చేస్తూ గుంటవాల జలాశయాలలో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరకుండా చర్యలు చేపడుతున్నారు. సీలేరు నుంచి విడుదలైన నీరు డొంకరాయిలో వచ్చి చేరుతుండడంతో ఇక్కడ నీటి మట్టం పెరగకుండా జలాశయం మూడు గేట్లు ఎత్తేశారు. డొంకరాయి జలాశయంలో శనివారం సాయంత్రం నాటికి పదడుగుల మేర నీటి మట్టం కొనసాగుతోందని సీలేరు కాంప్లెక్స్ అధికారులు తెలిపారు.

సాధారణ స్థాయికి గోదావరి నీటి ప్రవాహం

ధవళేశ్వరం, సెప్టెంబరు14: ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణస్థాయికి చేరుకుంటోంది. శుక్రవారం రాత్రి 12 గంటలకు నీటిమట్టం 11.70 అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై మధ్యాహ్నం నుంచి తగ్గుదల నెమ్మదించిన నీటి మట్టం రెండు గంటలకు ఒక్కపాయింట్ చొప్పున తగ్గుతూ శనివారం సాయంత్రానికి 10.40అడుగులకు చేరుకుంది. 7,96,505 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువన భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటి మట్టం శనివారం ఉదయానికి 38.80 అడుగులకు చేరుకుంది. పెనుగంగ పరిసరాల్లో కురిసిన వర్షాలు వల్ల ఇంద్రావతి నుంచి గోదావరిలో వరద నీరు కలుస్తూ ఉండటం వల్ల భద్రాచలం వద్ద 12 గంటలుగా 38.80 అడుగుల వద్ద నీటి మట్టం నిలకడగా ఉంది. దీనిప్రభావంతో నీటి మట్టం కొన్ని అడుగుల మేర పెరిగి ఆపై తగ్గుతుందని అధికారులు అంచనా.

అంతిమ సంస్కారానికి అగచాట్లు

డంపింగ్ యార్డులో మృతదేహం ఖననం
శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించాలంటూ
అరుంధతీయపేట వాసుల రాస్తారోకో, ధర్నా


డంపింగ్‌యార్డులోనే మృతదేహం ఖననం


శ్మశానవాటికను అభివృద్ధి చేయాలంటూ గొల్లప్రోలులో ఆందోళన చేస్తున్న అరుంధతీయపేట వాసులు

గొల్లప్రోలు, సెప్టెంబరు 14: కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని అరుంధతీయపేట, ఎస్సీ కాలనీ శ్మశానవాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించే వీలు లేక మృతదేహాన్ని డంపింగ్ యార్డులో ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అరుంధతీయపేటకు చెందిన అడ్డాల అప్పయ్యమ్మ (55) శనివారం మరణించింది. కొద్ది రోజులుగా ఏలేరు, సుద్దగడ్డ వరద నీరు అరుంధతీయపేట, ఎస్సీ కాలనీ పరిసరాల్లో ప్రవహించడంతో పాటు గృహాలు ముంపునకు గురయ్యాయి. స్మశానవాటికలోకి కూడా వరద నీరు చేరింది. దీనితో అప్పయ్యమ్మ మృతదేహాన్ని ఖననం చేసేందుకు కుటుంబసభ్యులు, బంధువులు వెళ్లగా అందుకు అవకాశం కనిపించలేదు. గోతులు తీయగా నీరు రావడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడిందని అప్పయ్యమ్మ కుటుంబసభ్యులు అడ్డాల ఏసు, శ్రీనులు ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో వారు ఆ మృతదేహాన్ని సమీపంలోని డంపింగ్‌యార్డులో ఖననం చేశారు. దీనితో అరుంధతీపేట వాసుల ఆవేదన ఆగ్రహంగా మారింది. స్మశానవాటికను అభివృద్ధి చేయాలంటూ కొన్నేళ్లుగా కోరుతున్నా నగరపంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ వారు గొల్లప్రోలులోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. స్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించామని, దశాబ్ద కాలానికి పైగా చెబుతున్నారని, ఇప్పటి వరకూ పని మాత్రం జరగలేదని వారు తెలిపారు. చనిపోయిన వారికి అంతిమసంస్కారాలు నిర్వహించేందకు అగచాట్లు పడుతున్నా ఎవ్వరి పట్టడం లేదని వారు మండిపడ్డారు. తక్షణం స్మశానవాటిక అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. గంటకు పైగా సాగిన వీరి ఆందోళనతో ట్రాఫిక్ నిలిచిపోయింది. దీనితో గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ, నగరపంచాయతీ మేనేజరు రామప్రసాద్, ఏఈ ప్రభాకర్‌లు అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. 15రోజుల్లోగా పనులు చేపడతామని వారికి హామీ ఇచ్చారు. అప్పటి వరకూ ఇబ్బంది లేకుండా తాత్కాలిక పనులు చేపడతామని తెలిపారు. దీనితో వారు ఆందోళన విరమించారు.

పాదగయ క్షేత్రంలో డీఆర్ఎం.. అన్నవరంలో హైకోర్టు న్యాయమూర్తి

పిఠాపురం, సెప్టెంబరు 14: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్ నరేంద్ర ఆనందరావు పాటిల్ సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి ఆయన శనివారం పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, దత్తాత్రేయస్వామి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. పాదగయ అధికారులు ఆలయ మర్యాదలతో డీఆర్ఎంను సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆయ న పిఠాపురం, కాకినాడ, అన్నవరం రైల్వేస్టేషన్లల్లో తనిఖీలు నిర్వహించారు. అక్కడ పరిస్థితులు, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట సామర్లకోట రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, అసిస్టెంటు డివిజనల్ ఇంజినీర్ బి.శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు రవికాంత్, జనార్దనరావు, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, కాకినాడ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కొండయ్య, సామర్లకోట ఎస్ఐ రామకృష్ణ ఉన్నారు. కాగా డీఆర్ఎం ఆనందరావుపాటిల్‌ను పిఠాపురం రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు తోట ఏడుకొండలు, డీవీఎస్ రాజు, అల్లుబోయిన సూరిబాబు, పైలా మల్లికార్జునరావు తదితరులు కలిశారు. జన్మభూమి, రత్నాచల్, విశాఖ, గరీబ్‌రథ్, బెంగుళూరు తదితర ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టులు ఇవ్వాలని కోరారు.

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, సెప్టంబరు 14: అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబసభ్యులతో శనివారం స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం, ఈవో స్వామివారి మెమెంటో ప్రసాదాలు అందజేశారు.


జస్టిస్ వెంకట జ్యోతిర్మయికి సత్యదేవుడి మెమెంటో అందిస్తున్న ఈవో

రైల్వే డీఆర్ఎం పూజలు

దక్షిణమధ్య రైల్వే డివిజినల్ రైల్వే మేనేజర్ నరేంద్రపాటిల్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు.

గణేష్ చౌక్ బీసీ బాలికల కళాశాల హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్,సెప్టెంబరు 14: రాజమహేంద్రవరం గణేష్ చౌక్‌లోని బీసీ బాలికల కళాశాల వసతి గృహం వార్డెన్‌ను అధికారలు సస్పెండ్ చేశారు. బాధిత విద్యార్థినుల కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం బీసీ బాలికల కళాశాల వసతిగృహంలో 132 మంది ఇంటర్ నుంచి పీజీ వరకు చదువుకునే విద్యార్థినులు ఉన్నారు. వారు తమ హాస్టల్‌లో ఆహారం, మరుగుదొడ్ల పరిస్థితిపై జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో సాంఘిక సంక్షేమ అధికారిణి శశాంక హాస్టల్‌కు వచ్చి విద్యార్థినులతో మాట్లాడి వార్డెన్ సత్యకుమారిని రెండు రోజుల క్రితం సస్పెండ్ చేశారు. అయితే కొంత మంది విద్యార్థినులు తమ వసతి గృహంలో ర్యాగింగ్ జరుగుతుందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి శుక్రవారం సాయంత్రం బయటకు వెళ్లారు. ఈ విషయం సాంఘిక సంక్షేమ అధికారిణికి తెలిసి శనివారం ఉదయం హాస్టల్‌కు వచ్చి వారిని విచారించారు. అయితే సస్పెండైన సత్యకుమారి ఇంకా పొజిషన్‌లోనే ఉండడంతో ఆమె ఉంటున్న భవనాన్ని ఖాళీ చేయాలని శశాంక ఆదేశించారు. తాను ఖాళీ చేయనని అనడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో అధికారి శశాంక వెంటనే తన విధులకు వార్డెన్ ఆటంకం కలిగించారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ స్పందించి రాజమహేంద్రవరం ఇన్‌చార్జి ఆర్డీవో కేఎల్ శివజ్యోతిని ఈ సంఘటనపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు ఆర్డీవో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 132 మంది విద్యార్థినుల స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ బీసీ బాలికల వసతి గృహంలో ఆహారం బాగోలేదన్న ఫిర్యాదు మేరకు బీసీ వెల్ఫేర్ అధికారి బి.శశాంక నివేదికతో వార్డెన్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారని చెప్పారు.

ఏజెన్సీ సమాచారం


విశిష్ట విద్యా సేవా పురస్కారం అందిస్తున్న దృశ్యం

ఏజెన్సీ డీఈవోకు విశిష్ట విద్యా సేవా పురస్కారం

రంపచోడవరం, సెప్టెంబర్ 14: చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా సూర్యకళామందిర్ కాకినాడలో ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావుకు విశిష్ట విద్యాసేవా పురస్కారం అందించారు. గత ఐదేళ్ల నుంచి చేయూత సేవా సంస్థ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాల్లో ఆయన వంతు సహకారం అందిస్తూ ఉండడంతో సేవలను గుర్తించి శ్రీయుత సేవా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ రవికుమార్ అవార్డు ప్రదానం చేశారు.

విలీన మండలాల రైతులపై వివక్ష

కూనవరం, సెప్టెంబర్ 14: తెలంగాణలోని భద్రాచలం పేపర్‌బోర్డులో విలీన మండలాల రైతులపట్ల వివక్ష చూపుతున్నారని కూనవరం మండల టీడీపీ మండల కార్యదర్శి, మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విలీన మండలాల గ్రామాల రైతులపై ఐటీసీలో వివక్ష జరుగుతుందని ఇక్కడి రైతులకు ఒక రేటు, బయట ప్రాంతాల రైతులకు మరో రేటు కేటాయిస్తున్నారన్నారు. పైరవీలు చేస్తున్న వారికే రేట్లు పలుకుతున్నాయని పేద, మధ్య తరగతులకు మాత్రం సరైన ధర పలకడంలేదన్నారు. కొన్ని ప్రాంతాల నుంచి జామాయిల్ కర్ర లోడులో మద్ది, జామ, తుమ్మ కర్రలను అడుగునవేసి విక్రయాలు చేస్తున్నారని అటువంటి నకిలీ కర్రకు కూడా అధిక రేటు కేటాయిస్తున్నారన్నారు. నాణ్యమైన జామాయిల్ కర్ర పంపిణీ చేసే రైతులకు అన్యాయం జరుగుతుందన్నారు. భారతదేశంలోనే ప్రథమస్థానంలో భద్రాచలం పేపర్‌బోర్డులో ఇటువంటి అవకతవకలు జరగడం అన్యాయమన్నారు. దీనిపై ఐటీసీ దృష్టిపెట్టాలన్నారు. కార్యక్రమంలో చెలకాని ఉమామహేశ్వరరావు, రసూల్, హెచ్.రాము, ఉదయ్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్‌కు సత్కారం


జమాల్‌ఖాన్‌ని సత్కరించి మిఠాయిలు తినిపిస్తున్న దళిత సంక్షేమ సంఘం యువకులు

చింతూరు, సెప్టెంబరు 14: ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ ఓ ఆపద్బాంధవుడని దళిత సంక్షేమ సంఘం, చింతూరు యువత పేర్కొన్నాయి. శనివారం జమాల్‌ఖాన్‌ని దళిత సంక్షేమసంఘం, చింతూరు యువత విడివిడిగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు జమాల్‌ఖాన్ చేస్తున్న సేవలు కొనియాడారు. వరదల సయంలో జమాల్‌ఖాన్ అందించిన సేవలు మరువరానివన్నారు. అదేదశలో చింతూరు శబరి వంతెనపై తన సొంత ఖర్చుతో ప్రత్యేక విద్యుత్ లైన్‌తోపాటు లైట్లు ఏర్పాటుచేయడం గొప్ప విషయమన్నారు. ఇటీవల విజయవాడలో 500మంది వరద బాధిత కుటుంబాలకు జమాల్‌ఖాన్ రూ.9లక్షల విలువైన రేషన్‌తో పాటు నిత్యావసరాలు అందించడం చింతూరుకే గుర్తింపు తీసుకొచ్చినట్లయిందని వరద కారణంగా జాతీయ రహదారిపై నిలచి పోయి ఇక్కట్లు పడుతున్న వాహనాల డ్రైవర్లకు జమాల్‌ఖాన్ ట్రస్టు ద్వారా భోజన సదుపాయం కల్పించారన్నారు. సన్మాన కార్యక్రమంలో చింతూరు సీఐ దుర్గారావు, ఎస్‌ఐ శ్రీనివాసరావు, మోతుగూడెం ఎస్‌ఐ గోపాలరావుతో పాటు యువత పాల్గొంది.

వరద బాధితులకు అన్నదానం

కూనవరం, సెప్టెంబర్ 14: ఇటీవల వచ్చిన గోదావరివల్ల పునరావాసానికి చేరిన వరద బాధితులకు శనివారం అన్నదానం నిర్వహించారు. కూనవరంనకు చెందిన కొమ్మాని వీర్రాజు దంపతులు అన్నదానం చేశారు. గత పదిరోజులుగా వరదల కారణంగా ఉదయభాస్కర్‌కాలనీకి చెందిన ప్రజలు కోతులగుట్టలో తలదాచుకుంటున్నారు. వీరికి అన్నదానం చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గణపతి నవరాత్రులు సందర్భంగా కూనవరం హైస్కూల్‌వద్ద అన్నదానం నిర్వహించారు.

విఘ్నేశ్వరస్వామి సన్నిధిలో అన్నసమారాధన

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 14: మండల కేంద్రమైన వీఆర్‌పురంలోని గోల్డ్‌షాప్ జగదీష్‌వారి ఈధిలో ఏర్పాటుచేసిన ఉత్సవ విఘ్నేశ్వరస్వామివారి మండపంలో అన్నసమారాధన కార్యక్రమం ఆలయ ఉత్సవకమిటీ సభ్యులు నిర్వహించారు. సుమారు వెయ్యిమంది భక్తులు ఈ అన్నప్రసాదాన్ని స్వీక రించా రు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు జగదీష్, భుజంగం, ఉప్పనపల్లి సా యి, దుర్గారావు, లక్ష్మణరావు, కామేశ్వరరావు, వీధిలోని పెద్దలు మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

చింతూరు: చింతూరులోని శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో గణపతి నవరాత్రుల సందర్భంగా శనివారం మహా అన్నదాన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వహించింది.

ఘనంగా లక్ష్మీ గణపతి హోమం

మోతుగూడెం, సెప్టెంబరు 14 : మోతుగూడెంలో శనివారం శ్రీలక్ష్మీగణపతి ఆలయలో గణపతి నవరాత్రుల్లో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకుడు పవన్ ఆధ్వర్యంలో స్వామి వారికి అష్టోత్తర శతనామళి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మి గణపతి హోమాన్ని నిర్వహించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ విత్తనాల సత్యనారాయణ దంపతులు, టీడీపీ ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు దంపతులు, వెంకటేశ్వరరావు, రత్నాకర్, చంద్రశేఖర్, పీటీ రామారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత


సాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

కూనవరం, సెప్టెంబరు 14: ఇటీవల విద్యుద్ఘాతంతో మృతిచెందిన ఆవుల వెంకటరామారావు కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ ద్వారా రూ.50వేలు వితరణ అందజేశారు. మృతుడి కుటుంబానికి ఈ ఆర్థిక సాయం అందజేశారు. హెల్పింగ్‌హాండ్స్ సభ్యులైన ఆవుల సంతోష్‌కుమార్, కర్నాటి సాయిప్రదీప్, ఆవుల వెంకటేష్, ఆవుల మురళీకృష్ణ తదితర ఆధ్వర్యంలో అందజేశారు. కార్యక్రమంలో కర్నాటి శ్రీను, ఆవుల గోపాలకృష్ణ, పరిటాల వెంకట్, సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రధాన అజెండాగా ప్రభుత్వం పనిచేస్తుంది

● జిల్లా కలెక్టర్ ప్రశాంతి


రోడ్డు పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 14: రాష్ట్రంలో అభివృద్ధే అజెండాగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ముఖ్యంగా రోడ్ల అభివృద్ధితోపాటుగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం మండలంలోని రామవరంలో రూ.1.50కోట్ల డీఎంఎఫ్ నిధులతో నిర్మించనున్న రామవరం-రాయవరం రహదారి నిర్మాణ పనులకు ఆమె ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఎక్కడ ఉన్నాయి, వాటిని ఎలా మంజూరు చేయించుకోవాలన్న అంశాలపై ఎమ్మెల్యే నల్లమిల్లికి పూర్తి అవగాహన ఉండటం ఈ రోడ్డుకు నిధులు మంజూరు చేయించు కోవడంతోనే అర్థమవుతుందన్నారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచి ప్రమాణ స్వీకారం చేయకుండానే ఈ రోడ్డుకు నిధులు సమకూర్చడం ఆయన కృషి పట్టుదలలకు నిదర్శనమన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రసంగిస్తూ రామవరం నుంచి రాయవరం వైపునకు రామదాసు పుంతగా పిలువబడే ఈ రోడ్డును 1983నుంచి టీడీపీ అధికారంలో ఉన్నపుడే జరుగుతుందని వాస్తు ప్రకారం ఈ రోడ్డు తమ కుటుంబానికి కలిసివస్తుందని, రోడ్డు బావుంటే మూలారెడ్డి కుటుంబం బావుంటుదని ప్రతిపక్షాలు కోరుకోవడం వారు అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్డును పట్టించుకోకపోవడం జరుగుతుందన్నారు. దుర్భరంగా ఉన్న సామర్లకోట వేమగిరి కెనాల్ రోడ్డును రాష్ట్ర నేషనల్ హైవేగా మార్పు చేసే ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని త్వరలోనే ఈ రోడ్డును అభివృద్ధి చేసే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హిమమహేశ్వరి, తహసీల్దార్ అనిల్‌కుమార్, మాజీ జెడ్‌పీటీసీ కర్రి శేషారత్నం, సర్పంచ్‌లు గిరిడా గంగాభవాని, గొల్లు హేమతులసి, తేతల సుధాకరరెడ్డి, కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిన్నారుల సంరక్షణకే మిషన్ భగీరథ పథకం

తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఈ పథకం ద్వారా ప్రతి చిన్నారికి నెలకు రూ.4వేల లబ్ధి చేకూరుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం రామవరంలో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం సందర్భంగా జరిగిన సభలో అనపర్తి మండలంలో మిషన్ భగీరథ పథకంలో అర్హత పొందిన 12మంది చిన్నారులకు ఆరు నెలలకుగాను ఒక్కొక్కరికీ మంజూరైన రూ.24వేల విలువైన మంజూరు పత్రాలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను బంధువులు సంరక్షకులుగా ఉంటూ వారిని చేరదీసి ఆదరించడం అభినందనీయమన్నారు.

బ్లాక్‌స్పాట్‌లను తనిఖీ చేసిన కలెక్టర్


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

కడియం, సెప్టెంబరు 14: కడియం మండలంలో పొట్టిలంక, కడియపులంక, బుర్రిలంక, వేమగిరి ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో శనివారం ఎస్పీతో కలిసి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. జిల్లా పరిధిలో ప్రమాద కూడళ్లను గుర్తించి అక్కడ చేపట్టాల్సిన భద్రతా చర్యలపై జాతీయ రహదారుల అధికారులకు సూచనలు చేశారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సూచికలను ఏర్పాటుచేసి వాహనదారులను అప్రమత్తం చేయాలన్నారు. అలాగే ప్రమాదాలకు కారణమైన రహదారి మరమ్మతులను అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా పూర్తిచేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి మార్గాలలో ప్రమాదాలను నివారించేందుకు నిర్దిష్టమైన వాహనాల్లో వాహనాలు పార్కింగ్ చేసేలా అవగాహన కల్పించాల్సి ఉందన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు పెట్రోలింగ్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డి.నరసింహకిషోర్, జాతీయ రహదారి ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్ర, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిషోర్, పలు శాఖల అధికారులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 14: ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి రాజమహేంద్రవరం అంబేడ్కర్ భవనంలో ఎస్సీ, మాల సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి దళిత నేతలు ఇసుకపట్ల రాంబాబు, నక్కా వెంకటరత్నం, మర్రి బాబ్జి, నక్కా విజయ్ కుమార్, సుందరపల్లి అనిల్ విచ్చేసి మాట్లాడారు. గ్రామ, నగరలలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైతన్య సదస్సులు నిర్వహించి కమిటీలు వేయాలని నిర్ణయించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి అందరు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు యర్రా రామకృష్ణ, గారా అప్పారావు, తోర్లపాటి శీతల్, గారా త్రినాథ్, జార్జి ఆంటోని, గుర్రం అనిల్, సోమబత్తుల విజయ్‌కుమార్, కోనాల లాజర్, సాయిబాబా, ఠాగూర్, ఎనుగుపల్లి రామకృష్ణ, తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఉన్నత పాఠశాల తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి

● పది విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఆరా


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 14: లాలాచెరువు చౌడేశ్వరనగర్‌లోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలను రా జమహేంద్రవరం ఎమ్మెల్యే ఆ దిరెడ్డి శ్రీనివాస్ తనిఖీ చేశారు. శనివారం 50వ డివిజన్‌కు వ చ్చిన ఆయన పాఠశాలకు వెళ్లి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సిలబస్ ఎంతవరకు అయ్యింది. ఇంకా ఎంత పూర్తి కావాల్సి వుంది, పాఠశాలలో బోధన ఎలా ఉంది. ఉపాధ్యాయులు బాగా చెబుతున్నారా, పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబు, మరుకుర్తి రవియాదవ్, యిన్నమూరి దీపు, చింతపల్లి నాని, గుడే రఘు నరేష్, చాపల చిన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి హ్యుండై అధునాతన కార్ ఆవిష్కరణ


హ్యుండై ద బోల్డ్‌న్యూఆల్కాజర్ కారు మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 14 : రాజమహేంద్రవరం హ్యుండైకార్ల షోరూంలో శనివారంరాత్రి హ్యుండై అధునాతన దిబోల్డ్ న్యూ ఆల్కాజార్ కార్‌ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మార్కెట్‌లోకి విడుదల చేశారు. కార్ల దిగ్గజ ం హ్యుండై తన ఎస్‌యూవీ మార్కెట్‌ను సుస్థిర పరుచుకొనేందుకు ఆధునాతన ఆల్కాజార్ కారు 6, 7 సీటర్స్ విభాగంలో విడుదల చేసింది, పెట్రోల్, డీజిల్ వెర్షన్‌లో కార్లను తయారు చేశారు. కార్ల ప్రారంభ ధర రూ.14.99 లక్షలు నుంచి రూ.21.39 లక్షలు వరకు ఉంటుందని, డీజిల్ కారు రూ.15.99 లక్షల నుంచి రూ.21.54లక్షల వరకు ఉంటుందని షోరూం నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మి గ్రూప్ హెడ్‌ఆఫ్ ఆపరేషన్స్ సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

రంగంపేట, సెప్టెంబరు 14: రంగంపేట జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి వృక్షశాస్త్రం (బోటనీ) జంతుశాస్త్రం(జువాలజీ) సబ్జెక్టులలో బోధించడానికి అతిథి అధ్యాపకులు (గెస్ట్ లెక్చరర్) నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పోస్టుగ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు 19న ఉదయం 11 గంటలకు కళాశాలలో అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని తెలిపారు.

'నూతన సాంకేతిక విజ్ఞానంపై పరిచయం అవసరం'

రాజానగరం, సెప్టెంబరు 14 : రానున్న కాలంలో రాబోయే నూతన సాంకేతిక విజ్ఞానంపై పరిచయం పెంచుకోవాలని వర్ఛ్యూస ఇండియా క్యాంపస్ హెడ్ అభిషేక్ దోయ్బాడే అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో భారత్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజనీ ర్స్‌డేను పురస్కరించుకుని గత రెండు రోజులుగా జరుగుతున్న మేథ సాంకేతిక ఉత్సవం శనివారంతో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ అడ్వాన్స్ కోడింగ్‌పై పట్టు సాధించాలన్నారు. దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర ప్రాముఖ్యత సంతరించుకుందని, యువ ఇంజనీర్లలో భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. రెండు రోజుల పాటు సాగిన మేధా వేడుకల్లో పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, ఇంట్రాక్టివ్ వెబ్ డిజైనింగ్, రోబో రేస్, టెక్నికల్ టాక్స్, క్విజ్ వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో జిజియు ఉపకులపతి యు.చంద్రశేఖర్, మేథ కన్వీనర్లు బి.సుజాత, తమిళకోడి,రిజిస్ట్రార్ పిఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్స్ జయానంద కుమార్, ఎంపీఎస్ బాబు, రామానుజం తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.40వేలు విరాళం

రాజమహేంద్రవరంరూరల్, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో భాగంగా కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ దాలిపర్తి వేమన ఆధ్వర్యంలో రూ.40వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి నివాసంలో అయన్ను కలిసి విరాళం అందించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న కుమ్మర శాలివాహన సంఘీయులు తమకు తోచిన విధంగా వరద బాధితులకు సహాయం చేయాలని వేమన పిలుపునిచ్చారు. మెరుగుమిల్లి సత్యనారాయణ, ఏడిద శ్రీనివాస్, పేరూరి గంగాధరం, మండ నాగేశ్వరరావు, పెద్దిరాజు పాల్గొన్నారు.

పంచదారతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి తులాభారం


తులాభారం నిర్వహిస్తున్న దృశ్యం

బిక్కవోలు, సెప్టెంబరు 14: బలభద్రపురంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన టీడీపీ నేత నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి అనపర్తి ఎమ్మెల్యేగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం సాధిస్తే పంచదారతో తులాభారం ఇస్తానని స్వామికి మొక్కుకున్నారు. శనివారం ఆలయంలో ఆయనకు 93 కిలోల పంచదారతో తులాభారం వేసి మొక్కు చెల్లించుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులకు ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఇతర కూటమి నేతలు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని శెట్టిబలిజ రామాలయంలో 108 కొబ్బరి కాయలు కొడతానని మొక్కుకున్న చోడే శ్రీను మొక్కును ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి నెరవేర్చారు.

'నిబంధనలకు అనుగుణంగా బంకుల నిర్వహణ ఉండాలి'

గోకవరం, సెప్టెంబరు14: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పెట్రోల్ బంకుల నిర్వహణ ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ చినరాముడు అన్నారు. గోకవరం-కృష్ణునిపాలెం రహదారి మధ్యలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంకు పరిశీలన నిమిత్తం శనివారం ఆయన గోకవరం వచ్చారు. బంకు పరిశీలన అనంతరం జాయింట్ కలెక్టర్ రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఈ-పంట, నమోదు, పలు రెవెన్యూపరమైన అంశాల గురించి తహశీల్దారు సరస్వతిని అడిగి తెలుసుకున్నారు.

అక్రమ ఇసుక తరలిస్తున్న ట్రాక్టరు సీజ్

సీతానగరం, సెప్టెంబరు 14: మండలంలోని ముగ్గళ్ళ నుంచి కూనవరం వెళ్లేదారిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీతానగరం పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రఘుదేవపురం ముగ్గళ్ళ గ్రామాలకు చెందిన ఈ రెండు ట్రాక్టర్లకు ఎటువంటి అనుమతులు లేవని అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండడంతో పట్టుకుని సీతానగరం తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ రామ్‌కుమార్ తెలిపారు.

గణేష్ కుటుంబ సభ్యులకు రూ.5లక్షలు అందజేత

బిక్కవోలు, సెప్టెంబరు14: అచ్యుతాపురం సెజ్ ఎసెన్షియా ఫార్మాలో జరిగిన దుర్ఘటనలో మృతిచెందిన బిక్కవోలుకు చెందిన కొప్పర్తి గణేష్ కుటుంబ సభ్యులకు శనివారం మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, జక్కంపూడి రాజాలు వైసీపీ ప్రకటించిన రూ.5లక్షల చెక్కును అందజేశారు. వైసీపీ నేతలు డాక్టర్ జంగా మురళీకృష్ణారెడ్డి, పోతుల ప్రసాదరెడ్డి, బుద్దాల కన్నారావు, పీవీ, సబ్బెళ్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'రుడా'కు విద్యుత్ ఉచితమా

● కార్యాలయంపై పట్టపగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 14: విద్యుత్ ఆదా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొంతు చించుకుని పెద్దఎత్తున ప్రచారాలు చేస్తుంటే రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి మాత్రం విద్యుత్ ఉచితంగా వస్తున్నట్లుగా వృథా చేస్తున్నారు. రుడా కార్యాలయంపై శుక్రవారం సాయంత్రం నుంచి ఎల్‌ఈడీ లైట్లు శనివారం సాయంత్రం వరకు వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్‌ను వృథా చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ సోలార్ ప్రాజెక్టు ఉన్నప్పటికీ పగటిపూట కూడా లైట్లు వెలిగించాలని లేదు కదా.


యూనివర్సల్ హాస్పటల్‌ను ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, మంత్రి దుర్గేష్

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం

● యూనివర్సల్ హాస్పిటల్స్ ప్రారంభోత్సవంలో మంత్రి సత్యకుమార్ యాదవ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 14: ఆధునిక వైద్యసేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి తేవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరం ప్రకాశంనగర్‌లో యూనివర్సల్ హాస్పిటల్స్ నూతన భవనాన్ని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ డాక్టర్ కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, ఆర్యాపురం కోపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చల్లా శంకరరావు తదితరులు విచ్చేశారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సంపూర్ణ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దుర్గేష్ మాట్లాడుతూ అత్యంత ఆధునికంగా యూనివర్సల్స్ హాస్పటల్‌ను ఈ ప్రాంతంలో ప్రారంభించడం సంతోషకరమన్నారు. యూనివర్సల్ హాస్పటల్స్ అధినేత డాక్టర్ ఆరుమిల్లి రాజేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలిసారిగా నీ ప్లస్ అగ్‌మెంటెడ్ రియాలిటీ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఆరుమిల్లి ప్రసాద్‌చౌదరి, డాక్టర్ ఆరుమిల్లి సీతారత్నం, నగర ప్రముఖులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ సభ్యత్వ నమోదు స్టాల్‌ను మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు.

మమ్మల్ని రెగ్యులరైజ్ చేయండి సారూ..

తమను రెగ్యులరైజ్ చేయాలని బోధనాసుపత్రి కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగినులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలసి కోరారు. శనివారం ఆయన రాజమహేంద్రవరం బోధనాసుపత్రికి రావడంతో కాంట్రాక్టు నర్సింగ్ స్టాఫ్ ఆయనను కలిసి ఈమేరకు ఒక వినతిపత్రం అందజేశారు. దీనిపై పరిశీలన చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఏఎన్‌ఎం నుంచి జీఎన్‌ఎం ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారి విషయంలోనూ న్యాయంచేస్తామని, గత ప్రభుత్వం అనాలోచితంగా ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి వ్యాఖ్యానించారు.



గుళికల పొడి కాఫీ తీసిన ప్రాణాలు!





ఆ వృద్ధులకు నలుగురు పిల్లలు.. జీవిత చరమాంకంలో వెంట ఒకరూ లేరు.. ఎవరి జీవితాలు వారివి.. ఒక పక్కవయో భారం.. సరిగా చూడలేరు.. సరిగా నడవలేరు.. దంపతులు ఇద్దరికీ శుక్రవారం కాఫీ తాగాలని అనిపించింది.. 64 ఏళ్ల భార్య కాఫీ పొడి అనుకుని గుళికల పొడి వేసి కాఫీ కాసింది.. 70 ఏళ్ల భర్త పక్కనే కూర్చుని కాఫీ అనుకుని ఇచ్చేసింది.. అతనితోపాటు ఆమె కూడా మరో గ్లాస్‌లో తెచ్చుకుంది.. ఇద్దరూ తాగేశారు.. కాసేపటికి నురగలు కక్కుతుండడంతో ఆసుపత్రికి తరలించగా ఇద్దరూ మృతిచెందారు.. వయోభారంతో ఉన్న వృద్ధులను ఒంటరిగా ఉంటే, ఏం జరుగుతుందనే దానికి ఈ సంఘటనే ఓ ఉదాహరణ.. - వివరాలు 8లో

రోగుల పట్ల నిర్లక్ష్యం సహించను : మంత్రి



ఆసుపత్రికి వచ్చిన పేషెంటును నవ్వుతూ పలకరించాలి.. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఒక్క ప్రాణం కూడా పోకూడదు. రాజమహేంద్ర వరం బోధనాసుపత్రిలో ఇటీవల మూడు శిశు మరణాలు సంభవించడం బాధ కలిగించిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ అన్నారు.. శనివారం ఆయన రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను పరిశీలించారు.. వైద్యులతో మాట్లాడారు.. సిబ్బంది సమస్యలు విన్నారు.. అన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. - వివరాలు 8లో

చిక్కని చిరుత జాడ

చిరుత పులి చిక్కలేదు.. ఇప్పటికి 8 రోజులైనా ఇంకా జాడలేదు.. ప్రతి రోజూ కెమెరాకు ఫోజు ఇస్తున్న పులి.. శుక్రవారం మాత్రం ముఖం చాటేసింది.. ఒక్కట్రాప్ కెమెరాకు కూడా చిక్కలేదు. అయితే అటవీ అధికారులు మాత్రం జనం అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.. రాత్రి వేళలో మాత్రమే పులి సంచరిస్తున్నట్టు ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి తెలిపారు. అయితే నేటికీ రిజర్వు ఫారెస్టు వద్ద రక్షణ చర్యలు చేపట్టపోవడం గమనార్హం. దీంతో రాజమహేంద్రవరం సమీపంలోని గ్రామాల జనం భయందోళనలో ఉన్నారు. - వివరాలు 8లో

ఆదివారం ప్రత్యేకం

కడలి గుండెల్లో.. గోదారి






సాగరాన..గోదారి

వశిష్ట నది అంతర్వేదిలో సముద్ర సంగమం చేసే ప్రాంతం ఇది. దీన్నే వద్ద అన్నాచెల్లెలు గట్టుగా పిలుస్తారు.

ఎక్కడో త్రయంబకేశ్వరంలో పుట్టిన గోదావరి.. వేల కిలోమీటర్లు ప్రవహించి రాజమహేంద్రవరం దగ్గర అఖండ గోదావరిగా రూపాంతరం చెందుతుంది. కొండకోనల్లోంచి, దట్టమైన అడవుల్లోంచి పారుతూ వచ్చి ఇక్కడ అపార జలధిగా శోభిల్లుతుంది. సాగు, తాగునీటిని అందిస్తూ ప్రాణాధారమవుతుంది. ఆ గోదావరిని నమ్ముకున్న ఎందరికో జీవనాధారమూ అవుతుంది. కానీ.. వరదొస్తే.. గోదారమ్మ ఉగ్రరూపిణిగా మారిపోతుంది. అప్పటిదాకా శాంతంగా, మంద్రంగా సాగుతున్న గోదావరి ఉరకలేస్తుంది. పరవళ్లు తొక్కుతూ విలయంలా వచ్చిపడుతుంది. పట్టలేనంత కోపంతో ఊగిపోతున్న అమ్మోరులా కళ్ల ముందు తాండవం చేస్తుంది. అప్పుడు వణికిపోవడం మనవంతవుతుంది. అప్పుడు చల్లగ చూడమ్మా గోదారమ్మా అని వేడుకోవడమే మన చేతుల్లో ఉంటుంది. వచ్చిన వరదను ధవళేశ్వరంలో గేట్లన్నీ ఎత్తి, దిగువకు వదిలేస్తే లంకల్ని ముంచేస్తూ సముద్రుడి చెంతకు వడివడిగా సాగిపోతుంది... అక్కడ...

ఇటు గోదారమ్మ.. అటు సముద్రుడు..

వారిద్దరూ మనకు అన్నాచెల్లెళ్లు కింద లెక్క అందుకే ప్రధానంగా గోదావరి సముద్రంలో కలిసేచోటును అన్నాచెల్లెళ్ల గట్టు అంటాం. నిజమే, ఇంత భారీ వరద ముంచెత్తితే మనం వరద బాధితులవుతాం. మరి ఇన్ని లక్షల క్యూసెక్కుల నీటిని.. వేల టీఎంసీ వరదను తనలోకి తీసుకుంటున్న సముద్రంలో ఏం జరుగుతోంది.. గత కొన్నేళ్లుగా ముంచెత్తుతున్న ఇంత భారీ వరద ప్రవాహాన్ని ఎలా స్థిరీకరిస్తున్నారు, అసలు వరద నీటి లెక్కలేంటి.. ఆ కథేంటో చూద్దామా..!



మహారాష్ట్ర నాసిక్‌లో పుట్టిన గోదావరి ధవళేశ్వరం వరకు అఖండ గోదావరిగా కొనసాగుతుంది. అక్కడి నుంచి నదీపాయలుగా విడిపోయి వివిధ ప్రాంతాల మీదుగా ప్రవహిస్తూ సముద్రంలో సంగమిస్తుంది. గోదావరి ఉపనదులను 'సప్తరుషు'ల పేర్లతో పిలుస్తారు. సప్తనదీ పాయల సంగమ ప్రాంతం కోనసీమలోనే ఉంది. ధవళేశ్వరంలోని బ్యారేజీ వద్ద గోదావరి రెండు పాయలుగా చీలుతుంది. తూర్పున గౌతమి, పడమర వశిష్ఠ. అక్కడి నుంచి తుల్యభాగ, ఆత్రేయ, గౌతమీ, భరద్వాజ, విశ్వామిత్ర, జమదగ్ని, వశిష్ఠ అనే పేర్లతో ఏడుపాయలుగా వివిధ ప్రాంతాల్లో సముద్రంలో కలుస్తాయి.

వరద నీరు కలిస్తే మంచిదే..



సముద్రంలో వరద నీరు కలవడం మంచి పరిణామమే. వరద నీరు ఎంత కలిసినా సముద్రానికి ఏమీ కాదు. ఎందుకంటే హిమాలయ పర్వతాన్ని తెచ్చి సముద్రంలో ముంచితే పర్వతమే మునిగిపోతుంది. పైగా మన దగ్గర బంగాళాఖాతంలో సముద్రం లోతు చాలా ఎక్కువ. దీని సరాసరి లోతు నాలుగు కిలోమీటర్లుపైనే ఉంటుంది. అదే సముద్రంలో కొన్నిచోట్ల అగాధాలు 13 కిలోమీటర్లపైనే ఉంటాయి. ప్రధానంగా వరద నీరు సముద్రంలో కలిసే ప్రాం తంలో వరద ప్రవాహం బట్టి అడుగున కోత ఏర్పడుతుంది. అలా కోత ప్రదేశాల్లో అగాధాలు ఏర్పడతాయి. ఈ అగాధాల్లోకి వరదలో కొట్టుకొచ్చిన మట్టి, ఇసుక పొరలుగా ఏర్పడి చమురు, గ్యాస్ తయారీకి సహకరిస్తాయి. వరద నీరు సముద్రంలో కలిసే చోట చప్ప నీటివల్ల కొంత ఉప్పు సాంద్రత తగ్గుతుంది. ఇది కొన్ని రకాల మత్స్య ఉత్పత్తులకు చాలా మేలు చేస్తుంది.

- జీపీఎస్ శర్మ, రిటైర్డ్ చీఫ్ సైంటిస్ట్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ

ముమ్మందు ముప్పు..

ఒకపక్క వరదలు.. మరోపక్క భూమి మీద ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో వాతావరణ మార్పులతో సముద్రమట్టం పెరిగే ప్రమాదం ఉందని ఆంధ్రప్రదేశ్ వాతావరణ మార్పుల విభాగం ఇప్పటికే హెచ్చరించింది. 2100 నాటికి ఈ మార్పుల ఫలితంగా సముద్రం, గోదావరి సంగమించే ప్రాంతంలో నీటిమట్టం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. దీనివల్ల ఉప్పునీరు మరింత ముందుకు రావడంతోపాటు సమీపంలో తీరంలోని 264 గ్రామాలకు ముప్పు పొంచి ఉందని హెచ్చరించింది. సముద్రం, గోదావరి కలిసే ప్రాంతాల్లో రక్షణగా ఉన్న మడ అడవులు దెబ్బతినడంతోపాటు భూగర్భ జలాలు కొంత ఉప్పుమయంగా మారుతాయని హెచ్చరించింది.

71 ఏళ్లుగా గోదారి ఇలా...

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

గోదావరి వరద రావడం.. ప్రతి ఏటా వేల టీఎంసీల నీరు వృథా అవుతోంది. సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ కెపాసిటీ 3 టీఎంసీలు. అప్పుడు పాండ్ లెవల్ 14.20మీటర్లు ఉంటుంది. బ్యారేజీ నీటిమట్టం 11 అడుగులు ఉంటుంది. దానికంటే తగ్గితే మూడు టీఎంసీల నీరు లేనట్టే. సాధారణంగా వరదల సమయంలోనే ఈ నిల్వ ఉంటుంది. ధవళేశ్వరం సర్కిల్‌లోని తూర్పు, సెంట్రల్, పశ్చిమ డెల్టాల్లో సుమారు 10 లక్షల ఎకరాల సాగు, మంచినీరు, పారిశ్రామిక, చేపల చెరువుల అవసరాలకు ఒక పంట సీజన్‌కు 110 టీఎంసీల నీరు కావాలి.

1986లో అతిపెద్ద వరద

1953 నుంచి వరద ప్రవాహాన్ని లెక్కిస్తున్నారు. 1953 ఆగస్టు 16న బ్యారేజీ నీటిమట్టం 22.75 అడుగులకు చేరడంతోపాటు 30,03,100 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి పోయింది. అప్పట్లో అనేక గండ్లుపడ్డాయి. ఈ వరదను ప్రాతిపదికగా తీసుకుని ఏటిగట్లు పటిష్టం చేశారు. 1986లో బ్యారేజీ నీటిమట్టం 24.55 అడుగులకు చేరడంతో 35,06,380 క్యూసెక్కుల వరద వచ్చింది. క్యూసెక్కు అంటే సెకనుకు వరద ప్రవాహం. ఒక టీఎంసీ 11,575 క్యూసెక్కులు. 1986లో ఆగస్టు 16న బ్యారేజీ నుంచి సెకనుకు 35,06,380 క్యూసెక్కుల నీరు ప్రవహించినట్టు లెక్క. ఆ ఒక్క రోజునే 302.92 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లిపోయింది. అప్పట్లో కూడా గండ్లు పడ్డాయి. అనంతరం అప్పటికి 5 మీటర్ల ఎత్తు ఉన్న ఏటిగట్లను 7 మీటర్లకు పెంచారు. గోదావరికి సుమారు 420 కిలోమీటర్ల ఏటిగట్టు ఉంటే.. రాజోలు, పి.గన్నవరం మండలాల్లో, ఇతర ప్రాంతాల్లోనూ సుమారు 30 కిలోమీటర్ల గట్టు ఎత్తు చేయలేదు. ఇది ఇప్పటికీ సమస్యగానే ఉంది. తర్వాత అంత పెద్ద వరద రాలేదు. 2022 జూలై 17న నీటిమట్టం 21.70 అడుగులకు చేరడంతోపాటు బ్యారేజీ నుంచి 25,80,963 క్యూసెక్కులు వరద సముద్రంలోకి పోయింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

గోదారమ్మకు వరదొచ్చిందటే ఎంత ఉగ్రంగా ఉంటుందో.. కడలిలో కలిసిపోయిన తరువాత అంత శాంతంగా మారిపోతోంది.. దేశంలోనే అతి పెద్ద నదీపరీవాహక (క్యాచ్‌మెంట్) ప్రాంతాల్లో గోదావరి ఒకటి. ఇందులో ప్రాణహిత, మంజీరా, మానేరు, ఇంద్రావతి, శబరి, సీలేరు, కిన్నెరసాని వంటి ముఖ్య ఉపనదులు, పెద్ద వాగులు కలుస్తాయి. గోదావరి స్థూలంగా ఎగువ, మధ్య, దిగువ నదీ ప్రాంతాలుగా పరిగణిస్తే మధ్య, దిగువ ప్రాంతాల్లోని ప్రాణహిత, ఇంద్రావతి, శబరివంటి ఉప నదుల నుంచే 57 శాతం నీరు గోదావరిలో వస్తుంది. ఇక్కడ ప్రవహించే ప్రతీ 1000 లీటర్ల నీటిలో 600 లీటర్లు ఈ ఉప నదులకు సంబంధించిందే. గోదావరిపై ఎక్కువ నిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టులు లేకపోవడం వల్లే తరచూ వరదలు వస్తున్నాయనే అంచనా ఉంది. గోదావరి వరద ప్రభావం నదీ గమనంలో ఒకే స్థాయిలో ఉండదు. గోదావరికి వరద పోటెత్తితే లక్షలాది క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తారు. ఈ నీరంతా కోనసీమ జిల్లా పరిధిలో అనేక పాయల ద్వారా సముద్రంలో కలుస్తోంది. వరద నీరు చప్పగా ఉంటుంది. గోదావరి వరద 1,480 కిలోమీటర్లు ప్రవహించి చివరకు యానాం, అంతర్వేది ప్రాంతాల్లో సముద్రంలో కలిసే ప్రాంతాన్ని గోదావరి ఈస్టరీగా పిలుస్తారు. చప్పగా ఉండే వరద నీరు సముద్రంలో కలిస్తే అక్కడ సముద్ర ఉప్పు నీటి సాంద్రత కొంత తగ్గుతుంది. దీనివల్ల మత్స్యరాశి భారీగా ఎదగడానికి ఆస్కారం ఏర్పడుతుంది. అదే సమయంలో వరదనీరు సముద్రంలో కలిసే ప్రాంతంలో కొంత ప్రమాదం ఉంది. వరదనీరు పొలాల నుంచి పరిశ్రమల కాలువల నుంచి పారుతూ వచ్చి సముద్రంలో కలిసే క్రమంలో వరి, ఇతర పంట సాగుకు రైతులు ఉపయోగించే ఎరువులు, పురుగుమందు, పరిశ్రమల రసాయనాల కాలుష్యం సముద్ర ముఖంలో కలిసి అక్కడున్న ఉప్పునీటిని విషతుల్యం చేస్తుంది. దీనివల్ల మత్స్యరాశికి కొంత నష్టం ఏర్పడుతుంది. వరద నీరు సముద్రంలో కలిసే చోట నష్టం కంటే లాభమే వేల రెట్లు ఉంటుంది. వరద నీరు ఉధృతంగా వచ్చి సముద్రంలో కలిసే చోట ఆప్రవాహ ధాటికి కోత పెరిగి అగాధాలు ఏర్పడతాయి. ఇలా ఏర్పడ్డ అగాధాల్లోకి వరద ద్వారా కొట్టుకు వచ్చే మట్టి, ఇసుక క్రమేపీ పొరలు పొరలుగా ఏర్ప డుతుంది. ఇలా కొన్ని వందల ఏళ్ల నుంచి సముద్రంలో వరద నీరు కలిసే ప్రాంతాల్లో పెద్దపెద్ద మేటలు పెరిగి బేసిన్‌గా ఏర్పడతాయి. ఈ బేసిన్‌లో మేటల వల్ల రసాయనిక చర్య జరిగి సముద్రంలో చమురు, గ్యాస్ నిక్షేపాలు తయారవుతాయి. ఇప్పుడు కేజీ బేసిన్‌లో కంపెనీలు తవ్వే చమురు, గ్యాస్ నిక్షేపాలు ఇలా ఏర్పడినవేనని శాస్త్రవేత్తలు చెబుతారు.



- గోదావరి ప్రయాణం 1480 కి.మీ
- అంతర్వేది వద్ద సాగరంలో సంగమం
- ప్రతి ఏడాది వేలాది టీఎంసీలు
- ప్రవాహ వేగానికి భారీ అగాధాలు
- అక్కడే బేసిన్ ఏర్పాటు
- దీనివల్లే చమురు, గ్యాస్ నిక్షేపాలు
- మత్స్యరాశికి ఎంతో మేలు
- పోలవరం పూర్తయితే ఉపయోగం
- వాతావరణ మార్పులతో ముప్పు

సముద్రంలో కలిసే నదులెన్నో..

కాకినాడ జిల్లాలోనే తుని మండలం పరిధిలో తాండవ ప్రాజెక్టు నీరు అంతా తునికి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్రంలో కలుస్తోంది. తొండంగి మండలంలో పంపా నది వరద నీరు వేమవరం మీదుగా అనకాపల్లి జిల్లా రాజవరం వద్ద, వర్షం నీరు జమ్మేరు కాలువ ద్వారా పెరుమాళ్లపురం మీదుగా ఉప్పాడ కొత్తపల్లి మండలం మూలపేట వద్ద సముద్రంలో కలుస్తోంది. యు.కొత్తపల్లి మండలంలో నాగులాపల్లిలోని పెదయేరు కాలువ ద్వారా, కొమరగిరిలోని అబ్బిరాజు యేరు, కొండెవరంలో కొండయ్య కాలువ, మారెమ్మ కాలువ, కొత్తపల్లి కొవ్వ కాలువ ద్వారా సముద్రంలోకి చేరుతోంది. కరప మండలంలో తుల్యభాగ డ్రెయిన్ ద్వారా తాళ్లరేవు మండలం మట్లపాలెం, పాతర్ల గడ్డ డ్రెయిన్ కరపమండలం ఉప్పలంక వద్ద సముద్రంలో కలుస్తోంది. తాళ్లరేవు మండల పరిధిలో ఆత్రేయ గోదావరి, మందార కాలువ ద్వారా సముద్రంలో వరద కలుస్తోంది.

సప్తనదుల సంగమం..

గౌతమి.. ధవళేశ్వరం నుంచి తూర్పువైపు ప్రవహిస్తున్న గౌతమి నది రావులపాలెం, కోటిపల్లి మీదుగా సుమారు 60 కిలోమీటర్ల మేర ప్రవహించి పాండిచ్చేరి రాష్ట్రంలోని యానాం సమీపంలో గల తీర్థాల మొండిలో సముద్రంలో కలుస్తుంది. నదుల్లోకెల్లా అతిపెద్ద నదిగా, అత్యంత పవిత్రమైనదిగా గౌతమికి పురాణ చరిత్ర ఉంది.

వృద్ధగౌతమి.. వృద్ధగౌతమి నదీపాయ ముక్తేశ్వరం నుంచి విడిపోయి గేదెల్లంక వద్ద త్రివేణి సంగమం నుంచి మురమళ్ల, పల్లంకుర్రు మీదుగా సుమారు 22 కిలోమీటర్ల మేర ప్రయాణిస్తుంది. పల్లంకుర్రు, బలుసుతిప్ప, మగసానితిప్ప మీదుగా ప్రవహించిన వృద్ధగౌతమీ నది తీర్థాల మొండి వద్దే సముద్ర సంగమిస్తుంది. ఈ నదీ పాయను ఆనుకుని మత్స్యకార గ్రామాలు ఉన్నాయి.

వశిష్ఠ నది.. విజ్జేశ్వరం నుంచి పడమరన వశిష్ఠ నది ప్రవహిస్తుంది. సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రవహించిన వశిష్ఠనది విజ్జేశ్వరం నుంచి సిద్ధాంతం, పి.గన్నవరం, రాజోలు, సఖినేటిపల్లి, అంతర్వేది మీదుగా ప్రయాణించి అంతర్వేదిలో సముద్ర సంగమిస్తుంది. ఈ ప్రాంతాన్ని అన్నాచెల్లెలు గట్టుగా పిలుస్తుంటారు. ఈ సంగమ ప్రాంతం ప్రమాదకరంగా మారడంతో భక్తులను స్నానాలకు అనుమతించడం లేదు. ఈ ప్రాంతంలో ఎంతో ప్రసిద్ధి కలిగిన అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ క్షేత్రం ఉంది.

వైనతేయ నది.. వశిష్ఠ నది నుంచి మరో పాయగా పి.గన్నవరానికి సమీపంలో చీలి వైనతేయ నదిగా ప్రవహిస్తుంది. పి.గన్నవరం, తొండవరం, బోడసకుర్రు, గోపాయిలంక మీదుగా 28 కిలోమీటర్ల మేర ప్రవహించి బెండమూర్లంక వద్ద సముద్ర సంగమం చేస్తుంది. ఇక్కడ అప్పనపల్లి బాలబాలాజీ ఆలయం ఉంది.

కౌశిక నది.. వైనతేయ నుంచి విడిపోయి అప్పర్ కౌశిక, లోయర్ కౌశికలుగా విడిపోయి వివిధ గ్రామాల గుండా ప్రవహించి అల్లవరం మండలం బెండమూర్లంక, కొమరగిరిపట్నం మీదుగా ప్రవహిస్తూ రామేశ్వరం వద్ద సముద్ర సంగమిస్తుంది. ఇది మేజర్ డ్రెయిన్‌గా కూడా ఈ ప్రాంత ప్రజలు భావిస్తుంటారు. తుల్యభాగ నది కోరంగి వద్ద సముద్రంలో కలుస్తుంది.

- అమలాపురం/ఆంధ్రజ్యోతి

1953 నుంచి వరదలు ఇలా..

1953 నుంచి 2024 సెప్టెంబరు వరకూ మొత్తం 21సార్లు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. 26సార్లు రెండో ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. ఐదు సార్లు మొదటి ప్రమాద హెచ్చరిక వరకే వరదొచ్చింది.18 సార్లు ఏవిధమైన హెచ్చరికలు లేకుండానే వరదొచ్చి వెళ్లిపోయింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద 11.75 అడుగులకు నీటిమట్టం చేరినా, 10 లక్షల క్యూసెక్కులు మిగులు జలాలు ఉన్నా మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 13.75 అడుగులు నీటిమట్టం ఉన్నా, 13 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు ఉన్నా, రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. 17.75 అడుగులకు నీటిమట్టం చేరినా 15 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలు ఉన్నా మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. మూడో ప్రమాద హెచ్చరిక అనేది చాలా డేంజర్ లెవల్ హెచ్చరిక.

మూడేళ్లలో 11,560.261 టీఎంసీలు

ప్రతి ఏటా జూన్ నుంచి మే నెల వరకూ వాటర్ ఇయర్ అంటారు. కానీ సాధారణంగా జూన్ నుంచి డిసెంబర్ వరకే గోదావరికి నీరు ఉంటుంది. ప్రతి ఏటా వేల సంఖ్యలో ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటికి 3307.306 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి. 2021 లో 2493.475 టీఎంసీలు, 2022లో 6246.214 టీఎంసీలు 2023లో 2821.572 టీఎంసీలు కలిపి ఆ మూడేళ్లలో 11,560.261 టీఎంసీల గోదావరి నీరు సముద్రం పాలైంది. ఇరిగేషన్ అధికారుల వద్ద ఒక లెక్క ఉంది. ప్రతి నాలుగేళ్లకు 20 లక్షల క్యూసెక్కులకు మించిన వరదొస్తుందని, ప్రతి పదేళ్లకు 25 లక్షలకు మించిన వరదొస్తుందనేది లెక్క. కానీ వాతావరణ కలుషిత, ఆక్రమణలు వల్ల ఈ లెక్క తప్పినట్టు కనిపిస్తోంది.

పోలవరం పూర్తయితే..

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే గోదావరి వరద నీటిని కొంతవరకూ సద్వినియోగం చేసుకోవచ్చు. పోలవరం రిజర్వాయర్ కెపాసిటీ 194 టీఎంసీలు. అందులో 175 టీఎంసీలు వినియోగించుకోవచ్చు. 19 టీఎంసీలు రిజర్వాయర్‌లో ఉంటాయి. పోలవరం ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ ఎత్తు 39.28 మీటర్లు లేదా 129 అడుగులు. ఇది ఎర్త్ డ్యామ్ ఎగువన అతి తక్కువ రివర్ బెడ్ స్థాయి నుంచి ఉంటుంది. డ్యామ్ పొడవు 3,722 మీటర్లు (12,211 అడుగులు). స్పిల్‌వే కెపాసిటీ 36 లక్షల క్యూసెక్కులు.



అవార్డు ప్రతిని అందజేస్తున్న పీడీజే సునీత

జాతీయ లోక్ అదాలత్.. 3 వేల కేసులు పరిష్కారం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని న్యాయ స్థానాల్లో ఏర్పాటు చేసిన 44 ప్రత్యేక న్యాయపీఠాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,053 కేసులు పరిష్కరించడం జరిగిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. రాత్రి 9గంటల వరకూ కేసులను విచారించి రాజీ మార్గం ద్వారా పరిష్కరించి రూ.35.57 కోట్లకు సంబంధించిన అవార్డు (తీర్పు)లను ప్రకటించామన్నారు. వీటిలో 576 సివిల్, 2273 క్రిమినల్, 204 ప్రీ-లిటిగేషన్ కేసులు ఉన్నాయని తెలిపారు. లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ఇసుకెలా!?

ఇసుక తీతకు గోదావరి వరద దెబ్బ

- వచ్చేవారం వరకూ ఇబ్బందే
- జిల్లాలో తీవ్ర కొరత
- బోట్స్‌మన్ సొసైటీల ముసుగు
- ఇసుక తీతకు తీవ్ర పోటీ...
- రాజకీయ సిఫార్సులూ అధికమే
- నిబంధనలతో వడబోస్తున్న కలెక్టర్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

అఖండగోదావరిలో డీ సిల్టేషన్ పేరుతో ఇసుక తీతకు ప్రభుత్వం అనుమతిచ్చినా, వరద వల్ల ఇసుక తీత ఆరంభంకాలేదు.ఈ నెల 11వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక ఆర్డర్లు బుక్ చేసుకోవడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కానీ అదే రోజు నుంచి గోదావరి వరద పెరగడంతో ర్యాంపులు ప్రారంభం కాలేదు. వచ్చే వారం వరకూ ఇసుక కొరత తప్పదు. ఇప్పటికే జిల్లాలో ఇసుక కొరత అధికంగా ఉన్న సంగతి తెలిసిందే.గత బుధవారం నుంచి బోట్స్‌మన్ సొసైటీల ద్వారా డీసిల్టేషన్ చేయించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.ఎన్ని బోట్స్‌మన్ సొసైటీలను ఎంపిక చేశారనే దానిపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు. మొత్తం 9 డీసిల్టేషన్ పాయింట్లను గుర్తించారు. బోట్స్‌మన్ సొసైటీల పేరుతో ఇసుక తీసే వారిలో పోటీ పెరిగింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉచిత ఇసుక విధానం ఎత్తివేసి ఇష్టానుసారం ఇసుక తోడేసిన సంగతి తెలిసిందే. అఖండగోదావరిలో బోట్స్‌మన్ సొసైటీలను అడ్డుపెట్టుకుని డ్రెడ్జింగ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రభుత్వం మారడంతో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చింది. కానీ ఇంత వరకూ గత ప్రభుత్వం స్టాక్ పెట్టిన ఇసుకనే ఉచిత విధానంలో అమలు చేశారు. జిల్లాలో అధికారులు ఇసుక అక్రమాలు లేకుండా సక్రమంగా ఉచిత ఇసుక అమలు చేయడానికి మార్గదర్శకాలు రూపొందించింది.ఈ నెల 11 నుంచి మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు.గోదావరి వరద వల్ల జిల్లాలో ఓపెన్ ర్యాంపులను తెరిచే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో ముందుగా అఖండ గోదావరిలో ధవళేశ్వరం బ్యారేజీ లోపల నుంచి ఫోర్త్ బ్రిడ్జి వరకూ డీసిల్టేషన్ విధానంలో ఇసుక తీతకు నిర్ణయించారు.ఈ పరిధిలో కొత్తగా డీసిల్టేషన్‌కు 9 పాయింట్లు గుర్తించామన్నారు.ధవళేశ్వరంలో 2, కోటిలింగాల ప్రాంతంలో ఒకటి, కొవ్వూరు పరిధిలోని వాడపల్లి, ఔరంగాబాద్-1, ఔరంగాబాద్-2, ఎర్రినమ్మ, దొండగుంట పాయింట్లు ఉన్నాయి.ఆయా ర్యాంపుల్లో ఇసుక తీత మొదలయ్యే అవకాశం ఉంది.ఈ డీసిల్టేషన్‌ను బోట్స్‌మన్ సొసైటీ ద్వారా తీయించడానికి నిర్ణయించారు.దీనితో గతంలో ఇసుక వ్యాపారం రుచి ఎరిగిన వారు ఈసారి ప్రయత్నాలు ఆరంభించారు. కానీ అధికారంలోకి వచ్చిన కూటమికి చెందిన వారు ఎక్కువ ఇసుక తీతకు ముందుకు వస్తున్నారు.దీంతో ప్రజాప్రతినిధులపై తీవ్ర ఒత్తిడి పెరిగింది.ఎమ్మెల్యేలు తట్టుకోలేనంతగా ఒత్తిడి పెరిగింది. పాతవారు, కొత్తవారు రిజిస్ట్రేషన్ చేయించుకుని బోట్స్‌మన్ సొసైటీలు నిర్వహించడానికి ముందుకొస్తున్నారు. కానీ గతంలో మాదిరిగా అధికారులు ఒప్పుకోవడంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తమ లక్ష్యం నెరవేరడమే పనిగా వ్యవహారం సాగింది. ఈ విధానం మార్చాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ప్రయత్నిస్తున్నారు. ప్రతి బోట్‌కు లైసెన్స్, ఫిట్‌నెస్, సొసైటీలకు రిజిస్ట్రేషన్, ఆడిట్ తప్పనిసరి చేశారు.దీంతో అనే సొసైటీలు గాబరా పడుతున్నారు. ఇరిగేషన్ అధికార్లకు ప్రస్తుతం 175 సొసైటీలు దరఖాస్తు చేసుకున్నాయి. వీటిని 13మంది సభ్యులతో కూడిన ఎంప్యానల్ కమిటీ పరిశీలించి అనుమతులు ఇస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న సొసైటీల్లో సుమారు 30 నుంచి 35 వరకూ మాత్రమే అర్హత కలిగిఉన్నట్టు తెలిసిందే. బోట్స్‌మన్ సొసైటీ నిర్వాహకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.కానీ వారి ఒత్తిడికి లొంగేటట్టు అధికారులు కనిపించడంలేదు.ఈ నేపథ్యంలో చాలా సొసైటీలు ఎగిరిపోతాయి.రాజమహేంద్రవరం, కొవ్వూరు ప్రాంతాల్లో సుమారు 220 సొసైటీలు ఉన్నాయి. వాటిలో ఇప్పటికే 175 దరఖాస్తు చేసుకుంటే అందులో సుమారు 30నుంచి 35వరకూ అనుమతి లభించినట్టు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో వరద తగ్గినా వచ్చే వారంలో ఏమేరకు డీ సిల్టేషన్ ఇసుక తవ్వకాలు మొదలవుతాయో చూడాలి మరి. ఇదిలా ఉండగా ఈసారి ఇసుక సరఫరాపై గట్టి నిఘా పెడుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టడానికి వీలుగా వినియోగదారుడి వివరాల ఆధారంగా క్రాస్ చెక్ చేసే వ్యవస్థను అమలులోకి తెచ్చారు.సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు.

గోష్పాదక్షేత్రంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లు

పరిశీలించిన డీఎస్పీ దేవకుమార్



గోష్పాదక్షేత్రంలో నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు, సెప్టెంబరు 14: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లను డీఎస్పీ జి.దేవకుమార్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు అఖండ గోదావరి నదికి వరద పోటెత్తడంతో గోష్పాదక్షేత్రం నీట మునిగింది. దీంతో ముందుగా వినాయక నిమజ్జనాలకు గీతా మందిరం ఎదురుగా, ఏపీ టూరిజం షెడ్డు పక్కన ఏర్పాట్లు చేశారు. వరద ముంపునకు గురికావడంతో నిమజ్జన ఏర్పాట్లను శనివారం క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదురుగా ఏర్పాటుచేశారు. క్రేన్ సహాయంతో వినాయక విగ్రహాలను గోదావరిలో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశామని, వినాయక చవితి ఉత్సవ కమిటీలు పోలీసు వారికి సహకరించాలన్నారు. నిమజ్జన ఊరేగింపుల్లో చిన్నపిల్లను తీసుకురావద్దన్నారు. నది ఉధృతంగా ప్రవహిస్తున్నందున నిమజ్జన సమయంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్ సీఐలు పి.విశ్వం, కె.విజయబాబు తదితరులున్నారు.

సంస్కృతి, సంప్రదాయాల్లో భాగస్వాములవ్వాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, సెప్టెంబరు 14: యువత వారాంతరాల్లో సంస్కృతి సాంప్రదాయాల్లో భాగస్వామ్యం కావాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం సాయంత్రం నిడదవోలులోని ఐ లవ్ నిడదవోలు వద్ద హ్యాపీయస్ట్ పార్కు పేరుతో వేదికను ఆయన సందర్శించారు. ఇటువంటి వేదిక ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని యువత, చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఉత్తేజం పొందుతూ తమ ప్రతిభను ఈ వేదికపై ప్రదర్శించేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, పాటి అయ్యప్ప పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నిడదవోలులో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్

నిడదవోలు, సెప్టెంబరు 14: రాష్ట్ర ప్రభుత్వం సెబ్‌ను రద్దు చేసి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ఆనందదాయకమని ఎక్సైజ్‌శాఖ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.వీరబ్రహ్మం అన్నారు. శనివారం నిడదవోలులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ప్రారంభం సందర్భంగా సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మం మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదాయం తీసుకురావడం అక్రమ మద్యం, సారా, గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతామని, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలు నూరుశాతం విజయవంతం అయ్యేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.దొరబాబు సిబ్బంది ఉన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం



రిటైర్డ్ ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న దృశ్యం

చాగల్లు, సెప్టెంబరు 14: సమాజ నిర్మాణంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని చాగల్లు ఎస్‌బీఐ మేనేజర్ కేపీ నాయుడు అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ రీడింగ్ రూంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ సమావేశం, గురుపూజోత్సవం నిర్వహించారు. రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యూవో సాల్మన్ రాజు సతీమణి శాంతిసుధ జ్ఞాపకార్థం ఆయన ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి రిటైర్డ్ ఉపాధ్యాయులు కోడి నాగేశ్వరరావు, దాసరి నాగేశ్వరరావు, వెత్సా గంగాధరం, కేఎస్ఎన్ మూర్తి, బచ్చు వెంకటరత్నం, పి.అనిల్‌కుమార్, కోడి సతీష్, వేంద్ర మోహన్‌కుమార్, స్వర్ణకుమారి, ఉమాదేవి సహా 20 మందిని సన్మానించారు. అనంతరం సన్మాన గ్రహీతలందరూ కలిసి కార్యక్రమం నిర్వహించిన సాల్మన్‌రాజును సన్మానించారు.

దేవరపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మీనాంచారమ్మ మృతి



లక్ష్మీనాంచారమ్మ(ఫైల్)

దేవరపల్లి, సెప్టెంబరు 14: దేవరపల్లి మాజీ సర్పంచ్ అంబటి లక్ష్మీనాంచారమ్మ(96) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె 2002-06లో దేవరపల్లి సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆమె కుమారుడు వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ అంబటి శ్రీనివాసరావు అండతో పంచాయతీని ముందుకు నడిపించారు. అంబటి కుటుంబం.. స్థానిక జడ్పీ హైస్కూల్‌కు నాంచారమ్మ మావయ్య అంబటి సత్యనారాయణరావు ఏడెకరాల స్థలాన్ని ఇచ్చారు. శివాలయానికి ఐదెకరాల భూమి విరాళం అందజేశారు. ఆమె మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, నాంచారమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాగంటి వెంకటేశ్వరరావు, సుంకర దుర్గారావు, యాగంటి శ్రీనివాస్, కరుటూరి శ్రీనివాస్, ఉప్పులూరి రాంబాబు, యాగంటి సాయిబాబు, జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో వినాయకుడి లడ్డూ వేలం

దేవరపల్లి, సెప్టెంబరు 14: దేవరపల్లి మెరక వీధిలోని వినాయకుని ఆలయంలో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 108 కిలోల లడ్డూను శనివారం వేలం నిర్వహించారు. జనసేన నాయకుడు దుగ్గిన లీలాకృష్ణగంగాధర నాయుడు, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పచ్చా రామ్‌గోపాల్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేరున రూ.63 వేలకు దక్కించుకున్నారు. ఆపై ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు, జనసైనికులు చప్పటి శివనాగప్రసాద్, సూరిశెట్టి బాలు, కంబాల సత్తిబాబు, మాధవరపు వెంకటేశ్వరరావు, పసుపులేటి శివనాగప్రసాద్ పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలకు 250మంది ఎంపిక

దేవరపల్లి జడ్పీ హైస్కూల్ పీడీ నాగరాజు



నియోజకవర్గ స్థాయికి ఎంపికైన అండర్-17 కబడ్డీ జట్టు

దేవరపల్లి, సెప్టెంబరు 14: నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు 250మంది ఎంపికయ్యారని పీడీ ఓరుగంటి నాగరాజు తెలిపారు. దేవరపల్లిలోని జడ్పీ హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఖోఖో, కబాడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-14, 17 విభాగాల్లో విద్యార్థినీవిద్యార్థులు 400మంది పాల్గొన్నారన్నారు. ఈ నెల 18న నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇదిలా ఉండగా స్కూల్ గేమ్స్ నియోజకవర్గ స్థాయి పోటీలకు తమ విద్యార్థులు 35మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు తెలిపారు. ఎంపికైన విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయమోపాధ్యాయులు కె.దుర్గాప్రసాద్, ఎస్.మంజులను బాష్యం జోనల్ ఇన్‌చార్జ్ ఆంజనేయులు అభినందించారు.

చిరుతను త్వరలోనే పట్టుకుంటాం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 14: చిరుతపులిని త్వరలోనే పట్టుకుంటామని జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి తెలిపారు. శనివారం స్థానిక మీడియాతో ఆమె మాట్లాడారు. ఇంతవరకూ నివాస ప్రాంతాల్లో చిరుతపులి సంచరించినట్టు నిర్ధారణ లేదన్నారు. చిరుతను సురక్షితంగా పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని అందులో భాగంగా 50 మంది సభ్యులు తొమ్మిది బృందాలుగా ఏర్పడి చిరుతపులి జాడ కోసం గాలిస్తున్నారన్నారు. చిరుత కదలికలను గుర్తించేందుకు 50 ట్రాప్ కెమెరాలు, సీసీ కెమెరాలతో బాటు, డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అలాగే నాలుగు ట్రాప్ బోనులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలకు 30 పాయింట్ ఫార్ములా

- బోధనాసుపత్రిలో శిశు మరణాలు బాధ కలిగించాయి
- విధుల్లో నిర్లక్ష్యంతో ఒక్కప్రాణం కూడా పోకూడదు
- ప్రతి మెడికల్ కాలేజీలో 35-40శాతం ఫ్యాకల్టీ కొరత
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 14: రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవల కోసం 30 పాయింట్ ఫార్ములాను రూపొందించామని, దీని ప్రకారం వైద్య సేవలందించడానికి నిర్దేశిత కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాజమహేంద్రవరం బోధనాసుపత్రిలో ఇటీవల మూడు శిశు మరణాలు సంభవించడం బాధ కల్గించిందని పేర్కొన్నారు. శనివారం రాజమహేంద్రవరం బోధనాసుపత్రిని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కామినేని శ్రీనివాస్‌లతో కలసి మంత్రి సత్యకుమార్ యాదవ్ సందర్శించారు. ఎంసీహెచ్ బ్లాకులోని గైనిక్ విభాగంలో తనిఖీలు చేశారు. పిల్లల వార్డును పరిశీలించారు. ఎంసీహెచ్ బ్లాకులోని సమావేశ మందిరంలో కలెక్టర్ పి.ప్రశాంతి, వైద్యాధికారులు, హెచ్‌వోడీలు, వైద్యులు, ప్రధాన వైద్య సిబ్బందితో ఆయన సమీక్ష జరిపారు. ఆసుపత్రిలోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ఒక్క ప్రాణం కూడా పోకూడదన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రుల్లోనూ మెరుగైన చికిత్సా విధానాలు, మౌలిక సదుపాయాల కల్పన, పరిస్థితుల్లో మార్పులు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఏదైనా తెలిసి తప్పు జరిగితే ఉపేక్షించరాదన్నారు. వేళ్లూనుకుపోయిన అవినీతిని నియంత్రించాలని, వ్యవస్థలో మార్పు తీసుకురావాలని సూచించారు. ప్రతి మెడికల్ కాలేజీలోనూ 35నుంచి 40శాతం ఫ్యాకల్టీ కొరత ఉంటే ఇక పిల్లలకు పాఠాలు ఎలా చెబుతారన్నారు. ఆరోగ్యం ప్రాథమిక బాధ్యతగా కూటమి ప్రభుత్వం భావిస్తోందని, ప్రభుత్వాసుపత్రుల పట్ల విశ్వాసం పెంచాల్సి ఉందన్నారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంటును నవ్వుతూ పలకరించాలని, వైద్యులు సిబ్బంది సమయానికి రావాలన్నారు. ఓపీ పక్కనే బ్లడ్ శాంపిల్స్ తీసుకునే ఏర్పాట్లు చేయాలని సూచించారు. అందరం కలసి పనిచేద్దాం, కచ్చితంగా పరిస్థితిలో మార్పు తీసుకొద్దాం అని స్పష్టం చేశారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ బయటి వ్యక్తులు ద్వారా రోగులు దోపిడీకి గురవుతున్నారని, ఈ సమస్య పరిష్కరించాల్సి ఉందన్నారు. బోధనాసుపత్రి నిర్వహణా వ్యవస్థలపై, ఇక్కడ అందుతున్న వైద్యసేవలు, రోగులకు ఎదురవుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చామన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆసుపత్రి మార్చురీలో ప్రైవేట్ వ్యక్తులు ఫ్రీజర్లు ఏర్పాటు చేసుకుని అధికమొత్తంలో డబ్బులు గుంజుతున్నారని, వాటిని నియంత్రించాలన్నారు. ఏపీఎంఎస్ఐడీసీ డీఈ కృష్ణారావు మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, ఆర్ఎంవో డాక్టర్ ప్రణవ్, ఇతర వైద్యాధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు. ముందుగా రోటరీ క్లబ్ రాజమండ్రి-రోటరీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జీజీహెచ్‌కు అందజేసిన వీల్‌చైర్లు, స్ట్రెచర్లను మంత్రి సత్యకుమార్ ప్రారంభించారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న జూనియర్ డాక్టర్లు



వైద్యాధికారులు, హెచ్‌వోడీలు, వైద్యులతో సమీక్షిస్తున్న మంత్రి సత్యకుమార్

రెగ్యులరైజ్ చేయండి: కాంట్రాక్టు నర్సింగ్ స్టాఫ్ వినతి

తమను రెగ్యులరైజ్ చేయాలని బోధనాసుపత్రి కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగినులు మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలసి కోరారు. శనివారం ఆయన రాజమహేంద్రవరం బోధనాసుపత్రికి రావడంతో కాంట్రాక్టు నర్సింగ్ స్టాఫ్ ఆయనను కలిసి ఈమేరకు ఒక వినతిపత్రం అందజేశారు. దీనిపై పరిశీలన చేస్తానని ఆయన పేర్కొన్నారు. అలాగే, ఏఎన్ఎం నుంచి జీఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసుకున్న వారి విషయంలోనూ న్యాయం చేస్తామని, గత ప్రభుత్వం అనాలోచితంగా ఈ నిర్ణయం తీసుకుందని మంత్రి వ్యాఖ్యానించారు. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాలకు చెందిన పలువురు పారా మెడికల్ స్టాఫ్.. తమకు 15 నెలలుగా జీతాలు చెల్లించడంలేదని, తమను ఆప్కాస్‌లో నిబంధనల మేరకు కలపాలని విజ్ఞప్తి చేశారు. కాగా, కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్న డయాలసిస్ పేషెంట్లకు సంబంధించి వారి కుటుంబీకులు ప్రస్తుతం ఇస్తున్న పింఛన్ రూ.10 వేలు ఏ మాత్రం చాలడంలేదని, పింఛను మొత్తం పెంచాలని మంత్రి సత్యకుమార్‌కు విజ్ఞప్తి చేశారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 154 కేసుల పరిష్కారం

- కొవ్వూరు ఇన్‌చార్జి 9వ అదనపు జిల్లా జడ్జి సత్యవతి



కొవ్వూరులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి

కొవ్వూరు, సెప్టెంబర్ 14: జాతీయ లోక్‌అదాలత్‌లో 154 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్టు కొవ్వూరు ఇన్‌చార్జి 9వ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. శనివారం కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. సత్యవతి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. శనివారం ముగ్గురు సిట్టింగ్ జడ్జిలతో 3 బెంచ్‌లను ఏర్పాటుచేసి రాజీ పడదగిన 154 కేసులను పరిష్కరించినట్టు చెప్పారు. మొదటి బెంచ్‌కు జిల్లా జడ్జి డి.సత్యవతి, 2వ బెంచ్‌కు సీనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి, 3వ బెంచ్‌కు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సాయికృష్ణ నిర్వహించగా న్యాయవాదులు కె.నాగేశ్వరరావు, టి.ప్రభాకరరావు, ఎం.గోపి సహకరించారన్నారు. ఈ లోక్ అధాలత్‌లో క్రిమినల్ కేసులు 60, సివిల్ కేసులు 47, ప్రిలిటికేషన్ కేసులు 47 పరిష్కరించి, కక్షిదారులకు రూ.5,71,08,256 ఇప్పించినట్టు పేర్కొన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నిడదవోలులో 28 కేసుల పరిష్కారం

నిడదవోలు, సెప్టెంబరు 14: నిడదవోలులోని కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ క్రిమినల్ కేసులు 12, మనోవర్తి 4, డివోర్స్ 3, ఎన్ఐ యాక్ట్ 1, సివిల్ 6, ప్రీ లిటికేషన్ 2 పరిష్కరించినట్టు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ తెలిపారు. సెకండ్ క్లాస్ స్పెషల్ మెజిస్ట్రేట్ జడ్జ్ నక్కా అజయ్ కుమార్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారన్నారు.



నిడదవోలులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి రామకృష్ణ

గుళికల పొడి ప్యాకెట్‌ను.. కాఫీ పొడి ప్యాకెట్ అనుకున్నారు..

- కాఫీ కాచుకుని తాగి వృద్ధ దంపతులు దుర్మరణం
- రాజానగరం మండలం పల్లకడియంలో ఘటన

రాజానగరం, సెప్టెంబరు 14: కాఫీ పొడి అనుకుని గుళికల పొడితో కాఫీ కాచు కుని తాగి వృద్ధ దంపతులు మృతిచెందిన విషాదఘటన ఇది.. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం పల్లకడియం గ్రామానికి చెందిన వెలుచూరి గోవిందు (70) భార్య అప్పయ్యమ్మ (64) వృద్ధ దంపతులు గ్రామంలో రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి నలుగురు సంతానం.. ముగ్గురు కుమార్తెలు.. ఒక కుమారుడు.. అందరికీ వివాహాలు చేశారు. కుమారుడు రాజమహేంద్రవరంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబంతో అక్కడే ఉంటున్నాడు. గ్రామంలో వృద్ధ దంపతులిద్దరూ ఒంటరిగా జీవనం సాగిస్తున్నారు. వయోభారం కారణంగా ఇద్దరికీ కంటి చూపు మందగించింది. ముగ్గురు కుమార్తెల్లో ఒక కుమార్తె భర్త లేకపోవ డంతో అదే గ్రామంలో నివాసం ఉంటోంది. తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటుంది. రెండు రోజులు కిందట ఇంటి వద్ద ఉన్న జామచెట్టు కింద గుళికల ఫౌడర్ ప్యాకెట్‌ను కాఫీ పొడిగా భ్రమించి ఇంట్లో దాచుకున్నారు. శుక్రవారం ఉదయం ప్యాకెట్ కట్ చేసి కాఫీ పొడి అనుకుని పాలలో వేసుకుని కాఫీ కాచుకుని ఇద్దరూ తాగారు. అనంతరం కొద్ది సేపటికి మగతగా ఉండడంతో మంచంపై పడుకున్నారు. ఇది గమనించిన స్థానికులు గ్రామంలో నివసిస్తున్న కుమార్తె వెంకటలక్ష్మికి సమాచారం అందించారు. వెంటనే ఇంటికి చేరుకున్న కుమార్తె మంచంపై పడుకుని నురగలు కక్కుతున్న తల్లిదండ్రులను చూసి హతాశురాలైపోయింది. ఏ జరిగిందని ప్రశ్నించగా రెండు రోజులు కిందట ఒక కోతి కాఫీ పొడి ప్యాకెట్ తెచ్చి ఇంటిపై పడేసిందని.. కాఫీ కాచుకుని తాగినట్టు తల్లి అప్పయ్యమ్మ బదులిచ్చింది. అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి అది వాసన లేని గుళికల పొడి ప్యాకెట్‌గా గుర్తించింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న తల్లిదండ్రులను ఆటోలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 12గంటలు దాటిన తరువాత ఇద్దరూ మృతిచెందారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. రాజానగరం ఎస్ఐ రేవతి కేసు నమోదు చేశారు.

ఘనంగా ఓనమ్ పండుగ



కొవ్వూరు హోలీ ఏంజిల్స్ పాఠశాలలో ఓనమ్ వేడుకలు

తాళ్లపూడి: స్థానిక మాంటిస్సోరీ పాఠశాలలో ఆశా అనీష్ ఆధ్వర్యంలో విద్యార్థులు కేరళా సాంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో ముగ్గులు వేశారు. ఓనమ్ పండుగకు ప్రత్యేకమైన పాయసం పంచిపెట్టారు. కరస్పాండెంట్, అపుస్మా జోన్ అధ్యక్షుడు వీవీ అనీష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తిరువనం రోజున మహాబలి చక్రవర్తి తన ప్రజలను చూడడానికి వస్తారనే నమ్మకంతో కేరళలో ఈ ఉత్సవం ఘనంగా నిర్వహిస్తారన్నారు.



తాళ్లపూడిలోని మాంటిస్సోరీ పాఠశాలలో..

కొవ్వూరు, సెప్టెంబరు 14: కొవ్వూరులోని హోలీ ఏంజిల్స్ పాఠశాలలో కేరళ జాతీయ పండుగ ఓనమ్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. శనివారం పాఠశాల కరస్పాండెంటు వలియవీడు నెల్సన్ ఆంటోని, జెస్సీనెల్సన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి పండుగను జరుపుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో వివిధరకాల పువ్వులతో రంగవల్లులు (పుక్కాలమ్) తీర్చిదిద్ది సాంస్కృతిక కార్యక్రమాలు సంప్రదాయ విందుతో పండుగను చేసుకున్నారు. ఆంటోని మాట్లాడుతూ కేరళ ప్రజలు 10 రోజుల పాటు జరుపుకునే అతి పెద్ద పండుగ ఓనమ్ అని, తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగను ఎంతబాగా జరుపుకుంటామో కేరళలో ఓనమ్ అలా జరుపుకుంటారన్నారు.



సాధారణ స్థాయికి గోదావరి ప్రవాహం

ధవళేశ్వరం, సెప్టెంబరు 14: ధవళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం క్రమంగా సాధారణ స్థాయికి చేరుకుంటోంది. శుక్రవారం రాత్రి 12గంటలకు నీటిమట్టం 11.70అడుగులకు తగ్గడంతో మొదటి ప్రమాదహెచ్చరికను ఉపసంహరించారు. ఆపై మధ్యాహ్నం నుంచి తగ్గుదల నెమ్మదించిన నీటి మట్టం 2గంటలకు ఒక్కపాయింట్ చొప్పున తగ్గుతూ శనివారం సాయంత్రానికి 10.40అడుగులకు చేరుకుంది. 7,96,505 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఎగువున భద్రాచలం వద్ద తగ్గుతున్న నీటిమట్టం శనివారం ఉదయానికి 38.80అడుగులకు చేరుకుంది. పెనుగంగ పరిసరాల్లో కురిసిన వర్షాలు వల్ల ఇంద్రావతి నుంచి గోదావరిలో వరద నీరు కలుస్తుండడం వల్ల భద్రాచలం వద్ద 12గంటలకు 38.80అడుగుల వద్ద నీటి మట్టం నిలకడగా ఉంది. దీని ప్రభావంతో నీటి మట్టం కొన్ని అడుగుల మేర పెరిగి ఆపై తగ్గుతుందని అధికారులు అంచనా.

17 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

విజ్జేశ్వరంలోని ఓ రైస్‌మిల్లులో విజిలెన్స్ తనిఖీలు



విజ్జేశ్వరంలోని కృష్ణసాయి రైసుమిల్లులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నిడదవోలు, సెప్టెంబరు 14: నిడదవోలు మండలం విజ్జేశ్వరంలోని కృష్ణసాయి రైసుమిల్లులో జిల్లా విజిలెన్స్ అండ్ సివిల్ సప్లయిస్ అధికార్లు తనిఖీలు నిర్వహించి సుమారు రూ.1,18,200 విలువైన 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. శనివారం నిడదవోలు మండలం పురుషోత్త పల్లికి చెందిన ముళ్ళపూడి గోపాలకృష్ణకు విజ్జేశ్వరంలో కృష్ణసాయి పేరుతో ఉన్న రైస్‌మిల్లును తనిఖీ చేశామని విజిలెన్స్ అధికార్లు నాగ వెంకటరాజు, విజయ్‌కుమార్ తెలిపారు. కొవ్వూరు మండలం సీతం పేటకు చెందిన ఆకుల పేర్రాజు మోటారుసైకిల్‌పై కృష్ణసాయి రైస్‌మిల్లులో రేషన్ బియ్యాన్ని అన్‌లోడ్ చేస్తుండగా అతనిని అదుపులోకి విచారించారు. రేషన్ కార్డుదారుల వద్ద కిలో రూ.17కు కొనుగోలు చేసి రైస్‌మిల్లుకు రూ.20కు విక్రయిస్తున్నట్టు తెలిపాడని చెప్పారు. కృష్ణసాయి రైస్‌మిల్లులో 34 బ్యాగ్‌లలో సుమారు 17 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించామని, వీటి విలువ సుమారు రూ.1,18,200 ఉంటుందని తెలిపారు. ఈ బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి 6ఏ కింద కేసు నమోదు చేశామన్నారు. రైస్‌మిల్లు యజమానిపై, బియ్యం విక్రయిస్తున్న వ్యక్తిపై క్రిమినల్ కేసు కోసం పోలీసులకు సిఫార్సు చేస్తున్నట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికార్లు జీవానందం, శివ, సివిల్ సప్లయ్ డీటీ అనిల్ తదితర్లు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 14: ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి రాజమహేంద్రవరం అంబేడ్కర్ భవనంలో ఎస్సీ, మాల సంఘాల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. దీనికి దళిత నేతలు ఇసుకపట్ల రాంబాబు, నక్కా వెంకటరత్నం, మర్రి బాబ్జీ, నక్కా విజయ్ కుమార్, సుందరపల్లి అనిల్ విచ్చేసి మాట్లాడారు. గ్రామ, నగరలలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైతన్య సదస్సులు నిర్వహించి కమిటీలు వేయాలని నిర్ణయించారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక ఉద్యమానికి అందరు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు యర్రా రామకృష్ణ, గారా అప్పారావు, తోర్లపాటి శీతల్, గారా త్రినాథ్, జార్జి ఆంటోని, గుర్రం అనిల్, సోమబత్తుల విజయ్‌కుమార్, కోనాల లాజర్, సాయిబాబా, ఠాగూర్, ఎనుగుపల్లి రామకృష్ణ, తాళ్ళూరి బాబు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.2.30 లక్షల సాయం

మలకపల్లి తెలుగుదేశం నాయకులు, కార్యకర్తల వితరణ



ఎమ్మెల్యే ముప్పిడికి నగదు అందిస్తున్న మలకపల్లి టీడీపీ కార్యకర్తలు

తాళ్లపూడి, సెప్టెంబరు 14: విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి మండలంలోని మలకపల్లిలోని తెలుగుదేశం నాయకులు,కార్యకర్తలు రూ.2.30 లక్షలు ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు, మద్దిపాటి ప్రకాశం, చెరుకూరి వెంకట్రావు, తుమ్మలపల్లి చంటి, సుంకవల్లి సత్తిబాబు, చెరుకూరి సత్యన్నారాయణ, కుంటముక్కల ప్రేమ్ చంద్, గెడ్డం జగజ్జీవన్, రాపాక శ్యామ్, గెడ్డం శ్రీను పాల్గొన్నారు.

విజయవాడకు నిత్యావసరాల తరలింపు

కొవ్వూరు, సెప్టెంబరు 14: దేచర్లలో గ్రామ యూత్ సభ్యులు విజయవాడ వరద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. శనివారం గ్రామంలో సేకరించిన నిత్యావసర వస్తువులు, ఆహార పొట్లాలు వ్యాన్‌పై విజయవాడ తరలించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఐడీ కార్డులు

తాళ్లపూడి, సెప్టెంబరు 14: బల్లిపాడులోని ప్రాథమిక పాఠ శాల(జేబీ) విద్యార్థులకు శనివారం ఐడీ కార్డులు పంపిణీ చేసినట్టు ప్రధానోపాధ్యాయుడు జి.విజయకుమార్ తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా చదువుతోపాటు దాతల సహాయంతో విద్యా ర్థులకు సదుపాయాలు కల్పిస్తున్నట్టు టీడీపీ నాయకుడు వల్లిపల్లి సతీష్ అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్‌పర్సన్ ఇందుగుమెల్లి మౌనిక, వైస్ ఛైర్‌పర్సన్ పల్లి ప్రసన్న, ఉపాధ్యాయురాలు వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ముప్పిడి పరామర్శ

చాగల్లు, సెప్టెంబరు 14: బ్రాహ్మణగూడెం గ్రామానికి చెందిన పేడాడ రాజేష్ ప్రమాదవశాత్తూ ఇటీవల మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం పరామర్శించారు. నిడవోలులో జరిగిన వినాయక నిమజ్జనం కార్యక్రమంలో రాజేష్ మృతిచెందడం బాధాకరమని ఆయన సంతాపం తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గారపాటి బాబురావు, దొమ్మేటి వేణు, పత్తిపాటి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.